RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 23 సెప్టెంబర్ 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:99

# శ్రీమతి ఇందిరా గాంధీ స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, ఎస్సీ, ఎస్టీలపై అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పని చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అత్యాచారాల నిరోధక చట్టం (SC/ST (Prevention of Atrocities) Act, 1989) అమలుపై ముఖ్యమంత్రి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013 ఫిబ్రవరి 11న అనాటి ముఖ్యమంత్రి అధ్యక్షతన చట్టం అమలుపై ఈ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మళ్లీ ఈ సమావేశం జరగడం ఇదే తొలిసారి.

మిగతా 2 లో

## హైదరాబాద్‌ను ముంచెత్తిన వర్షం.. అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రానున్న రెండు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి కూకట్‌పల్లి, ఆల్వాల్, బాలానగర్, మల్కాజిగిరి, బోయిన్‌పల్లి, అంబర్‌పేట, కోఠి, లక్డీకాపూల్ వంటి అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై వర్షపు నీరు భారీగా చేరడంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ముఖ్యంగా షేక్‌పేట పరిసర ప్రాంతాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాయుగుండం ప్రభావంతో మంగళ, బుధవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ క్రమంలో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం సహా ఎనిమిది జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేయగా, మరో 20 జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేసింది.

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. సహాయక బృందాలు, కంట్రోల్ రూమ్‌లు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# హైదరాబాద్ లో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

### అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిపై సమీక్ష
### వాటర్ లాగింగ్, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలి
### అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి



హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

భారీ వర్షాల పరిస్థితిపై జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్లతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.నగరంలోని వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద జీహెచ్ఎంసీ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

విద్యుత్, హైడ్రా, జీహెచ్ఎంసీ, పోలీస్, ట్రాఫిక్ తదితర అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఒకవైపు గణేశ్ నిమజ్జన కార్యక్రమాలు కొనసాగుతున్న నేపథ్యంలో, మరోవైపు భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. వాటర్ లాగింగ్ లేకుండా చూడడంతో పాటు ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోలీస్, ట్రాఫిక్ అధికారులను ఆదేశించారు.

ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు, వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన ప్రాంతాల్లో వెంటనే స్పందించి ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ప్రజలు కూడా అత్యవసరం కాని ప్రయాణాలను వీలైనంత వరకు వాయిదా వేసుకుని, వర్షాల పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో భారీ వర్షాలపై పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు.

# హాస్పిటల్‌లో ఫైర్ సేఫ్టీ, ఎమర్జెన్సీ సమయంలో తీసుకున్న చర్యలపై అధికారులతో మంత్రి సమీక్ష





ఆదిలాబాద్ రిమ్స్ హాస్పిటల్‌లోని స్పెషల్ నియోనాటల్ కేర్ యూనిట్(SNCU)లో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదం నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ రిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించారు.

అగ్ని ప్రమాదం అనంతరం చేపట్టిన రెస్క్యూ, రిలీఫ్ చర్యలను మంత్రి పరిశీలించారు.

ఎస్ఎన్‌సీయూలో చికిత్స పొందుతున్న శిశువులను సురక్షితంగా ఇతర వార్డులకు తరలించిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.

చికిత్స పొందుతున్న శిశువులు, పిల్లల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరా తీశారు.

శిశువులు, పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం మానిటర్ చేయాలని వైద్యులను మంత్రి ఆదేశించారు.

పిల్లల కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి, వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

హాస్పిటల్‌లో ఫైర్ సేఫ్టీ, ఎమర్జెన్సీ సమయంలో తీసుకున్న చర్యలపై అధికారులతో మంత్రి సమీక్ష చేస్తున్నారు.

సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఇతర అధికారులు ఉన్నారు

# కేటీఆర్‌కి సీన్ రివర్స్-రేవంత్ రెడ్డి సభతో కేటీఆర్ వెన్నులో వణుకు.

## ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలి-విప్ ఆది శ్రీనివాస్ ఫైర్!



**రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబరు 22,( ప్రజాబలం ప్రతినిధి )**కేటీఆర్ రాజకీయ పతనానికి కౌంట్‌డౌన్ షురూ అయింది. ఈ నెల 30న సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడుగుపెడుతున్నారనే వార్తతో కేటీఆర్ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి, వెన్నులో వణుకు పుడుతోంది,అని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల పాలనలో వేములవాడ రాజన్నను, సిరిసిల్ల నేతన్నలను మోసం చేసిన కేసీఆర్, కేటీఆర్‌లు రాజన్న ఆలయ ముంగిట ముక్కు నేలకు రాసి బహిరంగ క్షమాపణ చెప్పాలని విరుచుకుపడ్డారు.

మంగళవారం సిరిసిల్లలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆది శ్రీనివాస్ పాల్గొని కేటీఆర్, బీఆర్ఎస్ మార్క్ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సెప్టెంబర్ 30న సిరిసిల్ల వేదికగా జరిగే సీఎం రేవంత్ రెడ్డి జనజాతరను దాదాపు లక్ష మందితో హిస్టారికల్ సక్సెస్ చేస్తామని విప్ సవాల్ విసిరారు. పదేళ్లలో చేనేత కార్మికులకు రూ. 300 కోట్ల బకాయిలు పెట్టి ముంచింది బీఆర్ఎస్ కాదా, రాజన్న ఆలయ అభివృద్ధికి నయా పైసా ఇవ్వకుండా మాటలతో మోసం చేసింది నిజం కాదా, అని నిలదీశారు. కాంగ్రెస్ రాగానే చేనేత బకాయిలు తీర్చడమే కాకుండా, రూ. 49 కోట్ల రుణమాఫీ, రూ. 250 కోట్లతో రాజన్న ఆలయ రూపురేఖలు మారుస్తున్నామని తెలిపారు.

ఫామ్‌హౌస్ దొరల చిట్టా విప్పుతాం! ఎర్రవల్లి, జన్వాడ, రంగనాయకసాగర్ ఫామ్‌హౌస్‌ల వెనుక ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూముల గుట్టు త్వరలోనే రట్టు చేస్తాం అని హెచ్చరించారు. ధరణి పేరుతో పేదల పొలాలను గుంజుకున్న బీఆర్ఎస్ నేతల అక్రమాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందన్నారు. 22-ఏ భూముల సమస్యను పరిష్కరించి బాధితులకు పట్టాలు అందిస్తామని స్పష్టం చేశారు.ప్రతి గ్రామం నుంచి కాంగ్రెస్ శ్రేణులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు పెద్ద ఎత్తున తరలివచ్చేలా గ్రామ, మండల స్థాయిల్లో రూట్ మ్యాప్ సిద్ధం చేశామన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ గరిమ అగర్వాల్, ఎస్పీ మహేష్ బి. గీతేతో కలిసి సీఎం సభా స్థలంలో భద్రత, పార్కింగ్ ఏర్పాట్లను ప్రభుత్వ విప్ దగ్గరుండి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




**కేరళ వయనాడ్ కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా విద్యుత్ కమిటీతో జరిగిన సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మరియు వయనాడ్ ఎంపీ శ్రీమతి ప్రియాంక గాంధీ వాద్రా**

ప్రజాబలం

23 సెప్టెంబర్ 2026 బుధవారం

# ఇమేజ్ దిగజార్చుకుంటున్న రాహుల్...

ఇండియా కూటమి పార్టీల నుంచే పూర్తిస్థాయిలో ప్రధానమంత్రి అభ్యర్థిగా ఆమోదం పొందలేక తంటాలు పడుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తన చేష్టల ద్వారా ఇమేజ్‌ను మరింత దిగజార్చుకుంటున్నారు. మధ్యప్రదేశ్‌లో ఛాత్రోంకి గూంజ్ పేరుతో నిర్వహించిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు తావిచ్చింది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మధ్యప్రదేశ్లోని ఇండోర్‌లో నిర్వహించిన ఛాత్రోన్ కీ గూంజ్ యువజన సదస్సులో పాల్గొనడం రాజకీయంగా తీవ్ర దుమారానికి దారితీసింది. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీతో పాటు పాల్గొన్న స్టాండప్ కమెడియన్ పుల్కిత్ మాని , ప్రధాని నరేంద్ర మోదీ విదేశాంగ విధానాలు, ఆయన మాట్లాడే శైలిని అనుకరిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యంగ్య ప్రదర్శనలో ప్రధాని మోదీ దివంగత తల్లిని ఉద్దేశించి చేసిన కొన్ని వ్యాఖ్యల పట్ల రాహుల్ గాంధీ స్టేజ్‌పైనే బిగ్గరగా నవ్వుతూ కనిపించడం వివాదానికి అసలు కారణమైంది. ఈ ఘటనపై భారతీయ జనతా పార్టీ తీవ్రస్థాయిలో మండిపడింది. రాజకీయాల్లోకి తల్లులను లాగడం, వయోవృద్ధులైన మహిళలను కించపరిచేలా వ్యవహరించడం కాంగ్రెస్ పార్టీ దిగజారిన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని బీజేపీ నేతలు విమర్శించారు. కేంద్రమంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్పందిస్తూ.. ప్రధాని మోదీ తల్లిపై పరోక్షంగా జోకులు పేలుస్తుంటే రాహుల్ గాంధీ బాధ్యతారహితంగా నవ్వడం ఆయన నైతిక దివాలాకోరుతనానికి అద్దం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వైపు ప్రధాని మోదీ వృద్ధులను గౌరవిస్తూ సంప్రదాయాలను పాటిస్తుంటే, మరోవైపు రాహుల్ గాంధీ మాత్రం అటువంటి అగౌరవాన్ని ప్రోత్సహిస్తున్నారని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో కుటుంబ రాజకీయాలు, వ్యక్తిగత దూషణలు సాధారణమైపోతున్నాయనే విమర్శల మధ్య, ఈ ఉదంతం మరోసారి అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధాన్ని తారాస్థాయికి చేర్చింది. రాజకీయ విమర్శలు సిద్ధాంతపరంగా ఉండాలి కానీ, ఒక వ్యక్తి కుటుంబ సభ్యులను, ముఖ్యంగా దివంగత తల్లులను లక్ష్యంగా చేసుకుని అగౌరవపరచడం భారతీయ సంస్కృతికి విరుద్ధమని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ తరహా ధోరణి ప్రజాస్వామ్య విలువలను దిగజార్చేలా ఉందని, కాంగ్రెస్ పార్టీ నాయకత్వం క్షమాపణ చెప్పాలని సోషల్ మీడియాలో డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి ఓ స్టాండప్ కమెడియన్‌తో కలిసి దేశ ప్రధాని నరేంద్ర మోదీని, చనిపోయిన ఆయన మాతృమూర్తిని అలాగే వృద్ధులను కించపరిచేలా ఒక వివాదాస్పద స్కిట్‌ను ఆయన ప్రోత్సహించడం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. మిలియన్ల మంది ఈ వీడియోను వీక్షించారు. అది గొప్పగాకాంగ్రెస్ చెప్పుకుంటోంది. కానీ ఒక ప్రధానమంత్రి పదవిని ఆశిస్తున్న జాతీయ స్థాయి నాయకుడు ఈ స్థాయికి దిగజారి ప్రవర్తించడం మాత్రం ప్రజల మనసుల్లో ముద్రపడిపోతుంది. కాంగ్రెస్ శ్రేణులు దీన్ని ఏదో మాస్ అప్పీల్‌గా భావించి రాహుల్ గాంధీని తెగ పొగిడేస్తున్నారు. కానీ, రాజకీయం కోణంలో ఇది పూర్తిగా నిస్సిగ్గుగా సాగే దిగజారుడు ప్రవర్తనే అవుతుంది. ప్రత్యర్థి పార్టీ విధానాలను, పరిపాలనను సైద్ధాంతికంగా లేదా ప్రజా సమస్యల ఆధారంగా ఎండగట్టాల్సింది పోయి, వ్యక్తిగత దూషణలకు దిగడం రాజకీయ విలువలను పూర్తిగా దిగజార్చడమే. కేవలం చప్పట్లు, ఈలల కోసం దేశ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిని, కుటుంబ నేపథ్యాన్ని కించపరిచేలా వ్యవహరించడం రాహుల్ రాజకీయ పరిణతిలేమికి అద్దం పడుతోంది. ఈ చౌకబారు ప్రచారం స్వల్పకాలికంగా సోషల్ మీడియాలో హడావుడి చేసినప్పటికీ, దీర్ఘకాలంలో కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా తీవ్ర నష్టాన్ని చేకూరుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రతిపక్షాలు చేసే ఇలాంటి వ్యక్తిగత విమర్శలను, దూషణలను భారతీయ జనతా పార్టీ రాజకీయంగా ఎంత సమర్థంగా తనకు అనుకూలంగా మలుచుకుంటుందో గతం అనేకసార్లు నిరూపించింది. తమ అగ్రనేతను, ఆయన కుటుంబాన్ని కించపరిచిన ప్రతి అంశాన్ని బీజేపీ నాయకులు అత్యంత చురుకుగా, వ్యూహాత్మకంగా ప్రజల్లోకి తీసుకెళ్లి భావోద్వేగాలను రగిలిస్తారు. సామాన్యులు, ముఖ్యంగా సంప్రదాయ విలువలకు కట్టుబడే ఓటర్లు ఇలాంటి అగౌరవకరమైన రాజకీయాలను అసహ్యించుకుంటారు. దీన్ని ఆయుధంగా మలచుకునేషావో, కమలనాథులు కాంగ్రెస్ పార్టీ నైతిక దిగజారుడుతనాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి రాజకీయంగా భారీ లబ్ది పొందుతారనడంలో ఏమాత్రం సందేహం లేదు. దేశ ప్రధాని పదవికి పోటీ పడుతున్న రాహుల్ గాంధీ బాధ్యతారహితమైన వైఖరి వల్ల ఆయన ఖాతాలో మరోసారి భారీగా మైనస్ మార్కులు పడినట్లయింది. సమస్యలపై పోరాడటం మానేసి, ఇలాంటి వ్యక్తిగత దాడులు, దిగజారుడు స్కిట్‌లను ఆశ్రయించడం వల్ల ఆయన నాయకత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకం మరింత సడలిపోతోంది. బాధ్యతాయుతమైన పదవిలో ఉండాల్సిన వ్యక్తి పద్ధతి మార్చుకోకపోతే, భవిష్యత్తులోనూ కాంగ్రెస్ పార్టీకి ఇలాంటి చర్యలే పెను శాపంగా మారుతాయని ఎన్నో సార్లు నిరూపితమయింది. కానీ పాఠాలు మాత్రం నేర్చుకోవడం లేదు.

# SC, ST సంక్షేమానికి మరింత బలోపేతమైన చర్యలు

**స్టేట్ హైపవర్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి.**





**సత్తుపల్లి , ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 22:** రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ పథకాల అమలుపై హైదరాబాద్‌లో మంగళవారం రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన స్టేట్ హైపవర్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ హాజరయ్యారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు, వారి హక్కుల పరిరక్షణ, ఆయా వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. అణగారిన వర్గాలకు న్యాయం, సమాన అవకాశాలు అందేలా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడం, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అవసరమైన చర్యలను బలోపేతం చేయడంపై సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు.

# గణనాథుడీని దర్శించిన మంత్రి పొంగులేటి.

**రాష్ట్ర ప్రజలపై ఆ విఘ్నేశ్వరుడి కరుణాకటాక్షాలు ఉండాలి: మంత్రి పొంగులేటి**

**వాసవి కన్యకా పరమేశ్వరి కన్వెన్షన్‌లో వైభవంగా ప్రత్యేక పూజలు**

**నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా, సమన్వయంతో సాగాలి మంత్రి పిలుపు**




**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 22:** ఆటంకాలను తొలగించి సకల శుభాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆకాంక్షించారు.

గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తల్లాడ పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి కన్వెన్షన్ హాల్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొలువుదీరిన లంబోదరుడిని మంగళవారం వారు దర్శించుకున్నారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గణనాథునికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించారు.

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం సాగాలి: ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలను అదే స్ఫూర్తితో ముగించాలని కోరారు. రానున్న నిమజ్జన వేడుకలను భక్తులంతా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో, పరస్పర సమన్వయంతో జరుపుకొని ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి, ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు నంబూరు మోహన్ రావు, వేమిశెట్టి నాగన్న, జవ్వాజి సుబ్బారావు, జవ్వాజి నరసింహారావు, దార విష్ణు మోహనరావు, కమిటీ సభ్యులు, మండల, జిల్లా స్థాయి ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ శ్రేణులు, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# శ్రీమతి ఇందిరా గాంధీ స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది



మొదటి పేజీ తరువాయి

ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క , మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ , ఎంపీలు మల్లు రవి , బలరాం నాయక్ , కడియం కావ్య ఎమ్మెల్సీ గోరటి వెంకన్న , ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంతరావు , మేడిపల్లి సత్యం , కవ్వంపల్లి సత్యనారాయణ వేముల వీరేశం , మందుల సామేల్ , మట్టా రాగమయి , వెడ్మ బొజ్జు , మురళి నాయక్ గారు పాల్గొన్నారు.

సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు , డీజీపీ సీవీ ఆనంద్ , రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య , జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ బాబు , ఎస్సీ కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు, విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న సహాయం, పునరావాసంపై సమీక్షలో సుదీర్ఘంగా చర్చించారు. చట్టంపై అవగాహన కార్యక్రమాలు, కేసుల విచారణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టులు, మొబైల్ కోర్టుల పనితీరును విశ్లేషించారు.

రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో ఎస్సీ ఎస్టీలపై అట్రాసిటీ కేసులు క్రమంగా తగ్గుముఖం పట్టాయని అధికారులు వివరించారు. కొన్ని జిల్లాల్లో ప్రధానంగా 73 గ్రామాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని నివేదించారు. అక్కడ పోలీసు విభాగం ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరముందని తెలిపారు. జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీల సమావేశాలు క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

అత్యాచార ఘటనలపై ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. ఇలాంటి ఘటనల్లో బాధితులకు సకాలంలో నష్టపరిహారం, సహాయ పునరావాసం అందేలా చూడాలన్నారు. బాధితులను ఆదుకోవడంలో బడ్జెట్‌తో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్‌లో విడుదల చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

ఇటీవల షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడలో నర్సుపై హత్యాచారం కేసులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించి, బాధిత కుటుబాలకు సత్వర న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. సొంత తల్లిలా ప్రేమ చూపిన మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ని ఆ వర్గాలు ఇప్పటికీ మరిచిపోలేదని పేర్కొంటూ, 25 లక్షల ఎకరాల భూములకు అసైన్డ్ పట్టాలు అందించిన ఘనత ఇందిరాగాంధీ గారిదని అన్నారు.

శ్రీమతి ఇందిరా గాంధీ స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభా దాదాపు 16 శాతం ఉంటే, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో 31 శాతం మంది లబ్ధిదారులు ఎస్సీలేనని, ఎస్టీ జనాభా 10 శాతం ఉంటే, వారికి 17 శాతం ఇండ్లను మంజూరు చేశామని వివరించారు.

రాష్ట్రంలో 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని, తద్వారా ఆ వర్గాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. రాష్ట్రంలో 3.48 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేయడం ద్వారా దళిత, గిరిజన వర్గాలకు మంచి భోజనం అందించగలుగుతున్నామని చెప్పారు.

సంక్షేమ పథకాలతో పాటు చదువు ఒక్కటే అందరి జీవితాలను మారుస్తుందన్న విషయాన్ని ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. అట్టడుగు వర్గాలను చదువు వైపు నడిపించకపోతే సమస్యలు పరిష్కారం కావని గుర్తుచేశారు. పిల్లలను చదువు, క్రీడల వైపు ప్రోత్సహించాలని కోరారు. దళితులు, గిరిజనులు,ఆదివాసీల అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. అందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

# మట్టి వినాయకులను వాడి పర్యావరణ పరి రక్షణకు తోడ్పడాలి

## పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎం.అంజనకుమార్ యాదవ్ పిలుపు

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి హైద్రాబాద్ సెప్టెంబర్ 22: ముషీరాబాద్ నియోజక వర్గం లో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ ఆయా మం డపాలను దర్శించి ప్రత్యేక పూజలు, నిర్వహించారు. ఈ సందర్భంగా అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను వాడి పర్యావరణ పరి రక్షణకు తోడ్పడాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పి.కవిత,ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎస్.ధన్‌రాజ్, ముషీరాబాద్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.నరేందర్ యాదవ్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు సాయికీర్త్, మారిశెట్టి నర్సింగరావు, జయ,తదితరులు పాల్గొన్నారు.



# ఏఐని శాసిస్తున్న రాజానగరం బుల్లోడు

రాజమండ్రి, సెప్టెంబర్ 22, ప్రపంచ ఏఐ రంగాన్ని ఏలుతున్న ఓపెన్ ఏఐ వంటి గ్లోబల్ టెక్ దిగ్గజ సంస్థ భద్రతా కోటలను ఛేదించడం అంటే సాధారణ విషయం కాదు. కానీ, రాజమహేంద్రవరం సమీపంలోని ఒక చిన్న గ్రామంలో ప్రభుత్వ బడిలో చదివిన తెలుగు కుర్రాడు.. తన అపారమైన నైపుణ్యంతో ఓపెన్ ఏఐ సెక్యూరిటీ సిస్టమ్స్‌లోని తీవ్రమైన లోపాలను బయటపెట్టి ప్రపంచం వైపు తన వైపు తిప్పుకున్నాడు. అతడే రాజానగరం పరిధిలోని సంపత్‌నగరానికి చెందిన పెదపాటి మోహన్ శ్రీరామకృష్ణ . సైబర్ ప్రపంచంలో "బ1తీ1బీబ"గా సుపరిచితుడు.ఈ విజయం వెనుక ఉన్న అసలైన స్ఫూర్తి అతని నేపథ్యమే. మోహన్ శ్రీరామకృష్ణ రాజమహేంద్రవరంలోని సంపత్‌నగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోనే తన ప్రాథమిక, ఉన్నత విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే విదేశీ టెక్నాలజీలు అలవడవు, కార్పొరేట్ స్కూళ్ల చదువులే ముఖ్యం అనుకునే వారికి మోహన్ సాధించిన విజయమే ఒక బలమైన సమాధానం. ఆ తర్వాత నూజివీడు ట్రిపుల్ ఐటీ నుంచి కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసిన ఆయన, కోడింగ్, సైబర్ సెక్యూరిటీపై ఉన్న ఆసక్తితో ఎథికల్ హ్యాకింగ్ రంగంలో సరికొత్త శకానికి నాంది పలికారు.మోహన్, అతని సహచరులు హర్ష్ జైస్వాల్, రాహుల్ మైనిలతో కూడిన హ్యాకథాన్ ఏఐ బృందం ఓపెన్ ఏఐ కమ్యూనిటీ ఫోరమ్స్, ఎంప్లాయ్ అకౌంట్లలో ఉన్న సెక్యూరిటీ లోపాలను ప్రయోగపూర్వకంగా నిరూపించారు. ఆంత్రోపిక్ సంస్థకు చెందిన క్లాడ్ అనే మరో ఏఐ మోడల్‌ను ఉపయోగించి, కేవలం 72 గంటల్లో, తక్కువ ఖర్చుతో ఓపెన్ ఏఐ సిస్టమ్‌లోని ప్రైవేట్ గిట్ హబ్ రిపాజిటరీ వరకు యాక్సెస్ సాధించి గ్లోబల్ టెక్ వర్గాలను ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఒక ఎథికల్ హ్యాకర్‌గా ఈ భద్రతా లోపాలను గుర్తించిన వెంటనే వారు ఓపెన్ ఏఐ ప్రతినిధులకు సమగ్ర నివేదికను అందించి సిస్టమ్‌ను మరింత పటిష్టం చేయడానికి సహాయ పడ్డారు. దీనికిగాను ఓపెన్ ఏఐ నుంచి రివార్డుతో పాటు అంతర్జాతీయ గుర్తింపును పొందారు.చాలామంది టెక్ నిపుణులు ఇటువంటి విజయాలు సాధించాక విదేశాలకు వెళ్లడానికో లేదా మెట్రో నగరాల్లో సెటిల్ అవ్వడానికో ప్రాధాన్యత ఇస్తారు. కానీ, మోహన్ మాత్రం తన సొంత జిల్లాలోనే ఉంటూ ఐటీ రంగంలో అద్భుతాలు సృష్టించవచ్చని నిరూపించారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం కేంద్రంగానే ఇశ్రీవఇ‌బితీనీలనీశ్రీబి ఎనిటనీబవఇ' అనే సైబర్ సెక్యూరిటీ సంస్థను స్థాపించి ప్రపంచ స్థాయి క్లయింట్లకు పెనెట్రేషన్ టెస్టింగ్, సైబర్ ఆడిటింగ్ సేవలను అందిస్తున్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**వెలుగుమట్ల కాలనీని నవంబర్ 21లోగా అన్ని మౌళిక వసతులతో ఆదర్శ కాలనీగా అభివృద్ధి చేయాలి**

**రబీకి ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ ప్రణాళికను సెప్టెంబర్ నెలాఖరులోగా సిద్ధం చేయాలి**

**అక్టోబర్ నుంచి జూన్ వరకు పనుల సీజన్‌ను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి**

**ఖమ్మం నగర విద్యుత్ అవసరాలకు పదేళ్ల ప్రణాళిక రూపొందించాలి**

**ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన మంత్రి**






ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్22:ఖమ్మం నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్‌లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ఖమ్మం నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మంచుకొండ ఎత్తిపోతల పథకం పరిధిలోని అన్ని చెరువులను నింపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బుగ్గవాగు ఎత్తిపోతల పథకం పనులు చాలా కాలంగా ఆలస్యమవుతున్నాయని, పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. బుగ్గవాగు నీటిని గ్రావిటీ ద్వారా ఏఏ కాలువలకు అందించవచ్చో పరిశీలించి, అవసరమైన అంచనాలను సవరించి సమర్పించాలని ఆదేశించారు. పనుల పురోగతికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని తెలిపారు.

మున్నేరు రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు అవసరమైన 10-ఏ మినహాయింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పనుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించే ధోరణిని మార్చుకోవాలని, నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా బాధ్యతతో పనిచేయాలని అన్నారు. డ్రైనేజీ డిజైన్లు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ లేఅవుట్‌ను త్వరగా తుది రూపంలో సిద్ధం చేయాలని, వచ్చే వర్షాకాలం లోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సాగునీరు, త్రాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి అన్నారు. గోదావరి జలాలను సక్రమంగా ప్రణాళిక చేసుకుని వినియోగించాలని, ఒక్క ఎకరం పంట కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్టోబర్ 15 వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలువలు, షట్టర్లు, నీటి మట్టాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వచ్చే సీజన్ నుంచి అన్ని నిర్వహణ పనులను వేసవిలోనే పూర్తి చేయాలని ఆదేశించారు.త్రాగునీటినీ జాగ్రత్తగా వినియోగించాలని, నీటి విడుదల సమయాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలని మంత్రి సూచించారు. ఎక్కడా నీటి లీకేజీలు లేకుండా చర్యలు చేపట్టాలని, అవసరమైతే నాగార్జునసాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి కూడా నీటిని ఎత్తిపోసుకునే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు.

రోడ్లపై ఎలాంటి ఆక్రమణలు ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. కేబుల్ బ్రిడ్జి పనులకు మరో నెల రోజుల సమయం మాత్రమే ఉన్నందున పనులను త్వరగా పూర్తి చేయాలని, నవంబర్‌లో హ్యాండోవర్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

హ్యామ్ రోడ్లలో ప్రస్తుతం మంజూరైన బలోపేత పనులు అవసరం లేదని, నాలుగు లేన్ల రహదారి విస్తరణను ఇల్లందు వరకు చేపట్టేలా అవసరమైన అంచనాలను సవరించాలని సూచించారు. మెడికల్ కళాశాల హాస్టల్, అడ్మినిస్ట్రేటివ్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి కేబుల్ బ్రిడ్జితో పాటు ప్రారంభించేలా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

మంజూరైన అన్ని పనులను అక్టోబర్ నుంచి ప్రారంభించేలా సెప్టెంబర్ నెలాఖరులోగా టెండర్లు, ఇతర పత్రాల ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. అక్టోబర్ నుంచి జూన్ వరకు అనుకూలమైన పనుల సీజన్‌ను పూర్తిస్థాయిలో వినియోగించు కోవాలని తెలిపారు.

వచ్చే రబీ సీజన్‌కు వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటి నుంచే పంటల ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత లేకపోవడం, కాలువల ద్వారా సాగునీటి పరిస్థితి, భూగర్భ జలాల లభ్యత, విద్యుత్ సరఫరా వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని తెలిపారు. సెప్టెంబర్ నెలాఖరులోగా ప్రత్యామ్నాయ రబీ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

ఎల్‌నినో పరిస్థితులను అనుకూలంగా వినియోగించుకుని ఆయిల్‌పామ్ సాగును విస్తృతంగా పెంచాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులను వెంటనే ఎంపిక చేసి ఇళ్లను మంజూరు చేయాలని మంత్రి ఆదేశించారు. గుడిసెల్లో నివసిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యత, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివసిస్తున్న వారికి తదుపరి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అర్హులైన వారికే ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వెలుగుమట్ల కాలనీలోని అన్ని ఇళ్లను నవంబర్ 21లోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రం, విద్యుత్ లైన్లు, డ్రైనేజీ తదితర అన్ని మౌళిక వసతుల పనులను పూర్తి చేసి కాలనీని ఆదర్శ కాలనీగా అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసేలా ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను అనుసంధానం చేయాలని, మున్సిపల్ శాఖతో సమన్వయం చేసుకుని చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఖమ్మం నగరానికి వచ్చే పదేళ్లలో అవసరమయ్యే విద్యుత్‌ను అంచనా వేసి సబ్‌స్టేషన్లను ప్రణాళిక చేయాలని మంత్రి సూచించారు. ముఖ్యమైన ప్రాంతాల్లో విద్యుత్ కేబుళ్లతో పాటు అవసరమైన ఇతర కేబుళ్లను భూగర్భంలో ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారి విస్తరణ, భూగర్భ కేబుళ్లు, తదితర పనులను అన్ని శాఖల సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు.గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు దశల వారీగా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి అన్నారు.

అన్ని పాఠశాలలు, హాస్టళ్లను తనిఖీ చేసి అవసరమైన పనులను చేపట్టాలని, అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో కనీస మౌళిక వసతులు ఉండేలా చూడాలని ఆదేశించారు.

ఖమ్మంలోని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను వచ్చే జూన్ లోగా పూర్తి చేయాలని, రాష్ట్రంలో తొలి యంగ్ ఇండియా స్కూల్‌గా ఖమ్మం పాఠశాలను ప్రారంభించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

ఖమ్మంలో షాదీఖానా నిర్మాణానికి అనువైన స్థలాన్ని, హరిత భవన్‌కు అవసరమైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు పంపాలని రెవెన్యూ అధికారులను మంత్రి ఆదేశించారు. కమ్యూనిటీ అసోసియేషన్లకు భూమి కేటాయింపులను ఒకే ప్రాంతంలో చేపట్టేలా స్థలాన్ని గుర్తించి అవసరమైన కేటాయింపులు చేయాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ దివాకర 'ిఎస్ మాట్లాడుతూ మంచుకొండ ఎత్తిపోతల పథకం పరిధిలోని చెరువులను నింపుతున్నట్లు తెలిపారు. మున్నేరు రక్షణ గోడ మిగిలిన పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.

పంచాయతీరాజ్ శాఖ పరిధిలో హ్యామ్ రోడ్లకు సంబంధించి 10 పనులకు రూ.36.60 కోట్ల మంజూరు లభించిందని, టెండర్ ప్రక్రియ పూర్తయిందని, నెల రోజుల్లో పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు.

ఖమ్మం నియోజకవర్గంలో ఏడు కొత్త సబ్‌స్టేషన్లు ప్రతిపాదించామని, వాటికి అవసరమైన భూములు కేటాయించామని కలెక్టర్ తెలిపారు. భూగర్భ విద్యుత్ కేబుళ్ల ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించినట్లు వెల్లడించారు.

ఈ సీజన్‌లో జిల్లాలోని 20 మండలాల్లో వర్షపాతం లోటు ఉన్నప్పటికీ గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం కేవలం 7 వేల ఎకరాలు మాత్రమే తగ్గిందని తెలిపారు. పెసర సాగు విస్తీర్ణం పెరిగిందని, ఈ ఏడాది అదనంగా 5 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టినట్లు వివరించారు.

ఖమ్మం ఖిల్లా రోప్‌వే దిగువ స్టేషన్ పనులు కొనసాగుతున్నాయని, 2027 మార్చి నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో మంజూరైన 137 పనుల్లో 54 పనులు పూర్తయ్యాయని, మరో 54 పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు తెలిపారు. నీటి నిల్వ సమస్యలను పరిష్కరించామని, ప్రధాన రహదారులపై యంత్రాలతో స్వీపింగ్ నిర్వహించడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తున్నాయని వివరించారు.ఈ సమీక్షలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పుట్ట బద్దలు కొడుతున్న రావణ్....

గుంటూరు, సెప్టెంబర్ 22, పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని సాగించిన విషప్రచారం, రాజ్యాంగ వ్యవస్థలపై చేసిన తీవ్ర వ్యాఖ్యల కేసులో కస్టడీలోకి తీసుకున్న జోసఫ్ రావణ్ విచారణలో నోరు విప్పినట్లు తెలుస్తోంది. తనను ముందుపెట్టి నడిపించిన అసలు సూత్రధారుల జాతకాలను, కుట్ర కోణాలను పోలీసుల ఎదుట పూసగుచ్చినట్లు వెల్లడిస్తున్నట్లు చెబుతున్నారు. సోషల్ మీడియా వేదికగా సమాజంలో అలజడులు సృష్టించేలా, ఆర్మీ కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం వెనుక ఉన్న పొలిటికల్ హ్యాండ్లర్ల వివరాలను ఆరా తీస్తున్న అధికారులకు రావణ్ సంచలన వివరాలను అందించినట్లు సమాచారం.ముఖ్యంగా జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యంగా సాగిన వ్యక్తిత్వ హనన కార్యక్రమాలు, దానికి అందిన ఫండింగ్ మూలాల గుట్టు ఇప్పుడు విచారణలో పూర్తిగా రట్టవుతోంది. తాను ఒక వ్యూహం ప్రకారం ఎందుకు పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకోవాల్సి వచ్చింది, డిజిటల్ క్యాంపెయిన్లు నడిపేందుకు నిధులు ఎక్కడి నుంచి ప్రవహించాయి అనే అంశాలపై రావణ్ స్పష్టమైన సమాచారం ఇచ్చాడని తెలుస్తోంది. తాను ఆవేశంలో చేసిన వ్యాఖ్యల వెనుక కొంతమంది వైసీపీ నేతల ఆర్థిక సహకారం, తాము మేధావులం అని చెప్పుకునే కొందరు వ్యూహకర్తల ప్రోత్సాహం బలంగా ఉందనే విషయాన్ని ఒప్పుకున్నట్లు సమాచారం.గతంలో మావోయిస్టులు, నక్సలైట్లకు మద్దతుగా మాట్లాడటం, జాతీయ భద్రతకు ముప్పు కలిగించేలా ఆర్మీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం వెనుక ఉన్న నెట్‌వర్క్ నెమ్మదిగా వెలుగులోకి వస్తోంది. తనను రెచ్చగొట్టి, సోషల్ మీడియా వేదికగా తీవ్రమైన కేసుల్లో ఇరుక్కునేలా చేసిన పెద్దలు ఇప్పుడు స్పందించకపోవడం, తనను ఒంటరిని చేయడంతో రావణ్ కస్టడీలో పోలీసుల అడిగిన ప్రశ్నలకు ఏమాత్రం దాచకుండా సమాధానాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. చట్టపరమైన చిక్కుల నుంచి తప్పించుకోవడానికి ఏకైక మార్గంగా అప్రూవర్‌గా మారే యోచనలో ఉన్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.రావణ్ ఇచ్చిన కస్టడీ వాంగ్మూలం ఆధారంగా రాబోయే రోజుల్లో ఏపీ పోలీస్ యంత్రాంగం కీలక చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉంది. కేవలం మైక్ ముందుకు వచ్చి మాట్లాడిన వ్యక్తులనే కాకుండా, తెరవెనుక ఉండి ఫండింగ్ చేసిన వైసీపీ నేతలకు, ప్రోత్సహించిన ఇతర వ్యక్తులకు నోటీసులు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రావణ్ బయటపెట్టిన సమాచారంతో, ఇన్నాళ్లూ సోషల్ మీడియా వేదికగా ఫేక్ నెరేటివ్‌లు నడుపుతూ వ్యవస్థలపై దాడికి దిగిన అసలు సిసలు దొంగలకు శాస్తి జరగడం ఖాయంగా కనిపిస్తోంది.

# సూపర్ సీఎంగా లోకేష్

విజయవాడ సెప్టెంబర్ 22, ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో కీల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నారా లోకేష్ పై ఇటీవలి కాలంలో కొన్ని వర్గాలు, మాజీ అధికారులు విపరీతంగా స్పందిస్తున్నారు. వినాయక చవితి ఉత్సవాల వేళ డీజేల నిర్వహణ, శబ్ద నియంత్రణపై ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తుల మేరకు హోంమంత్రికివ వినతి చేయడం ద్వారా అనుమతులు ఇప్పించారు. దీంతో ఆయన సూపర్ సీఎంగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు.

అయితే, ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించే క్రమంలో ఆయన చూపుతున్న క్రియాశీలక చొరవను పాజిటివ్‌గా చూడటానికి బదులు, అధికారాన్ని చెలాయిస్తున్నారంటూ రాజకీయం చేయడం వెనుక బలమైన అసూయే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. పీవీ రమేష్‌తో పాటు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ట్విట్టర్ వేదికగా లోకేష్ ప్రాధాన్యతను ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ప్రకటనల్లో స్థానిక మంత్రుల ఫోటోలు లేవని, లోకేష్ జోక్యం ఎక్కువైందని రోజువారీ విమర్శలు గుప్పిస్తూంటారు. ప్రభుత్వం ఓ పాలసీ పెట్టుకుంది. ఏదైనా సీఎం , పీఎం, డిప్యూటీ సీఎం ఫోటోలు మాత్రమే ఉంటాయి. దాన్ని గుర్తించడం లేదు. ఈ మాజీ అధికారుల బాధ వేరే ఉంది. ప్రభుత్వంలో తమకు అత్యంత ప్రాధాన్యత దక్కుతుందని అనుకున్నారు కానీ వారిని దూరం పెట్టారు. తమను దూరం పెట్టడానికి నారా లోకేశే కారణం అని వీరనుకుంటున్నారు. ఇలాంటి వర్గాలకు లోకేష్ వేగవంతమైన వర్కింగ్ స్టైల్ ఏమాత్రం జీర్ణమవడం లేదు. లోకేష్ గనుక తమను దగ్గరకు తీసి, తమ సొంత ఎజెండాలకు ప్రాధాన్యత ఇచ్చి ఉంటే.. ఇదే సత్వర నిర్ణయాధికారాన్ని డైనమిక్ లీడర్‌షిప్ అంటూ పొగిడేవారనడంలో సందేహం లేదు. తమకు సందు దొరకడం లేదన్న అసహనమే ఈ సూపర్ సీఎం ప్రచారానికి ప్రధాన ఇంధనంగా మారింది. నిజానికి కూటమి ప్రభుత్వంలో మంత్రిమండలి అంతా ఒకే కుటుంబంలా, ఒకే టీమ్‌లా పనిచేస్తోంది. క్షేత్రస్థాయి నుంచి వినతులు వచ్చినప్పుడు లేదా ప్రజల అత్యవసర సమస్యలు పరిష్కరించాల్సి వచ్చినప్పుడు, కేవలం తన పరిధి కాదని లోకేష్ మిన్నకుండిపోవడం లేదు. సంబంధిత శాఖా మంత్రులను ఆదేశించడం కాకుండా, వారికి పద్ధతిగా విజ్ఞప్తి చేస్తూ సమన్వయం చేసుకుంటున్నారు. వ్యవస్థలో నిర్ణయాల ప్రక్రియ వేగవంతం కావడానికి లోకేష్ తీసుకుంటున్నది బాధ్యత మాత్రమే తప్ప, అధికారం కాదనేది స్పష్టమవుతోంది. కేబినెట్ సహచరులతో సత్సంబంధాలు కలిగి ఉంటూ, ఎవరి పరిధిని ఉల్లంఘించకుండా ప్రజా సమస్యలపై దృష్టి సారించడాన్ని దురాక్రమణ గా చిత్రీకరించడం వారి అసూయేకూటమి అధికారంలోకి వచ్చాక పరిశ్రమలను రప్పించడం, విద్యా వ్యవస్థలో సంస్కరణలు తేవడం, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను స్వయంగా పర్యవేక్షించడం ద్వారా లోకేష్ తన ప్రతిభను నిరూపించుకుంటున్నారు. ప్రతిపక్షాలు సృష్టించే మైండ్ గేమ్‌లను , విమర్శకుల వ్యాఖ్యలను పట్టించుకోకుండా, ప్రభుత్వం వేగంగా పరుగెత్తేలా ఒక ఉత్ప్రేరకం లా పనిచేస్తున్నారు. నిర్ణయాధికారం జాప్యం కాకుండా సమన్వయకర్తగా వ్యవహరించడాన్ని ఆధిపత్యంగా అభివర్ణించడం అంటే.. మారుతున్న ఆధునిక రాజకీయ నాయకత్వ శైలిని అర్థం చేసుకోవడంలో విమర్శకులు విఫలమవ్వడమే.

లోకేష్ సాధిస్తున్న ప్రజాదరణ, రోజురోజుకూ పెరుగుతున్న రాజకీయ ప్రాధాన్యతనే ప్రత్యర్థులకు, మాజీ అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. అధికారం చెలాయించడం వేరు, ఒక పక్కా వ్యూహంతో సమర్థవంతంగా పరిపాలనా పగ్గాలను పటిష్టం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండటం వేరు. దీన్ని విమర్శించేవారు గుర్తించాల్సి ఉంది.

# వైసీపీలో పొంచి ఉన్న సంక్షోభం...



విజయవాడ సెప్టెంబర్ 22, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పేరు, అధికారిక గుర్తును కేంద్ర ఎన్నికల సంఘం స్తంభింపజేస్తూ తీసుకున్న నిర్ణయం దేశ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీల అధినేతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే చేతుల నుంచి శివసేన ఏక్‌నాథ్ షిండే చేతికి, శరద్ పవార్ పట్టు నుంచి ఎన్సీపీ అజిత్ పవార్ చేతికి ఎలాగైతే ప్రజాప్రతినిధుల సంఖ్యాబలం ఆధారంగా వెళ్లిపోయాయో.. ఇప్పుడు బెంగాల్‌లోనూ మమతా బెనర్జీపై రెబల్స్ పైచేయి సాధించి పార్టీని చేజిక్కించుకునే దశకు చేరుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాలు, చట్టపరమైన పూర్వాపరాలను పరిశీలిస్తే.. శాసనసభాపక్షంలో సంఖ్యాబలం ఉన్న వర్గానికే అసలైన పార్టీగా గుర్తింపు దక్కుతోందన్నది కాదనలేని వాస్తవంగా మారింది. ఇదే సూత్రం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనూ సరికొత్త చర్చకు ఆజ్యం పోస్తోంది. ప్రస్తుతం ఏపీ అసెంబ్లీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం కేవలం 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే. భారత రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం.. శాసనసభాపక్షంలో మూడింట రెండొంతుల మంది ప్రజాప్రతినిధులు ఒకే తాటిపైకి వస్తే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఎలాంటి అనర్హత వేటు పడదు. అంటే, మొత్తం 11 మందిలో జగన్‌ను మినహాయించి మిగిలిన 10 మంది ఎమ్మెల్యేలు గానీ, కనీసం 8 మంది సభ్యులు గానీ ఒకే మాటపై నిలబడి తిరుగుబాటు బావుటా ఎగరేస్తే చట్టపరంగా వారి సభ్యత్వాలకు ఎలాంటి ఢోకా ఉండదు. అలాంటి పరిస్థితుల్లో సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వంటి వ్యూహకర్త నాయకత్వం వహిస్తే, శాసనసభాపక్షంలో సంపూర్ణ ఆధిక్యతతో అసలైన వైఎస్సార్‌సీపీ తమదేనంటూ స్పీకర్, ఎన్నికల సంఘం ముందు వాదనలు వినిపించే సాంకేతిక వెసులుబాటు స్పష్టంగా కనిపిస్తోంది. ఒకవేళ జగన్ నియంతృత్వ ధోరణికి వ్యతిరేకంగా అసమ్మతి వర్గం బయటకు వస్తే.. పార్టీకి భావోద్వేగ పునాదులైన వైఎస్సార్ కుటుంబ సభ్యులను రంగంలోకి దించడం మరో కీలక వ్యూహం కాగలదు. జగన్ వ్యవహారశైలితో ఇప్పటికే పార్టీకి దూరమైన తల్లి వైఎస్ విజయమ్మ , రాజకీయంగా పోరాడుతున్న వైఎస్ షర్మిలను గౌరవ అధ్యక్షురాలిగానో, అధినేత్రిగానో తెరపైకి తెస్తే.. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానులు, సంప్రదాయ ఓటుబ్యాంకును తమవైపు తిప్పుకోవడం అసమ్మతి వర్గానికి మరింత సులువవుతుంది. వైఎస్సార్ ఆశయాలు, అభిమానుల ప్రాతిపదికనే ఏర్పడిన పార్టీ కావడంతో.. కుటుంబంలో జగన్ మాత్రమే కాకుండా మిగిలిన వారికీ ఆ వారసత్వ హక్కు సహజంగానే దక్కుతుంది. ఇది పార్టీ క్యాడర్‌లో చీలికను సహజమైనదిగా మార్చేందుకు తిరుగులేని అస్త్రంగా మారుతుంది. ఎన్నికల ఓటమి తర్వాత వైఎస్ జగన్ వ్యవహరిస్తున్న ఒంటెద్దు పోకడలు, క్షేత్రస్థాయికి దూరమైన వింత రాజకీయం పార్టీ నాయకులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. గతంలో అధికారాన్ని అనుభవించిన నేతలు నేడు కేసులు, వ్యాపార నష్టాలు, రాజకీయ భవిష్యత్తు లేని శూన్యతతో కొట్టుమిట్టాడుతున్నారు. భవిష్యత్తులో పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలో కార్యాచరణ లేని అధినేతను నమ్ముకుని ఉంటే తమ రాజకీయ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని పలువురు ముఖ్య నేతలు భావిస్తున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో జగన్ నీడ నుంచి బయటపడి, సొంతంగా పార్టీపై పట్టు సాధించడమో లేదా బలమైన ఫ్రంట్‌గా మారి కేంద్ర, రాష్ట్ర అధికార వర్గాలతో సంప్రదింపులు జరపడమో మాత్రమే వారి ఆస్తులను, రాజకీయ జీవితాలను కాపాడుకునే ఏకైక మార్గంగా కనిపిస్తోంది. అయితే ఈ ఫార్ములా అమలు కావడానికి ప్రధాన అవరోధం ఎమ్మెల్యేలకు ఉన్న రాజకీయ ధైర్యం. జగన్ ఆర్థిక, సామాజిక బలాల ముందు ఎదురునిలిచి బరిలోకి దిగడానికి ఎమ్మెల్యేలు ఇప్పటికీ సంశయిస్తున్నారు. కానీ, రాయలసీమలో తనకంటూ సొంత బలం, విస్తృత ఆర్థిక నెట్‌వర్క్ ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లాంటి సీనియర్ నేత గనుక తెగించి అడుగు ముందుకు వేస్తే పరిస్థితులు శరవేగంగా తలకిందులవుతాయి. మహారాష్ట్ర, బెంగాల్ ఉదంతాలు నిరూపిస్తున్నట్లుగా.. తిరుగుబాటు చేసి సంఖ్యాబలాన్ని నిరూపించుకుంటే ఎవరి చేతికైనా పార్టీ చిక్కుతుందనే భయం జగన్‌ను వెంటాడక తప్పదు. పెద్దిరెడ్డి ఆలోచన మారితే.. వైఎస్సార్‌సీపీలో పెను భూకంపం ఖాయమని అనుకోవచ్చు.

# మూడు రోజులపాటు ఉత్తరాంధ్రలో వర్ష సూచన

విశాఖపట్నం ఉత్తరాంధ్ర జిల్లాల్లో సెప్టెంబర్ 22 నుంచి 25 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధి కారులు తెలిపారు. బంగాళాఖా తంలో కొనసాగుతున్న అల్పపీడ నం పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ మరింత బలప డనుంది. సెప్టెంబర్ 21న వాయు గుండంగా, 22న తీవ్ర వాయు గుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచ నా వేసింది. సెప్టెంబర్ 23 ఉద యం ఉత్తరాంధ్ర?దక్షిణ ఒడిశా తీరానికి సమీపించే అవకాశం ఉంది.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీకలుగా నిర్మాణాలు

## సమగ్ర ప్రణాళికతో విమానాశ్రయాల పనులు చేపట్టాలి...

## శాఖల మధ్య సమన్వయంతోనే పనులు వేగవంతం

## ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**

హైదరాబాద్: ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ నిర్మాణాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలుగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతికి ప్రతిరూపాలుగా ఉన్న కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయం, పిల్లలమర్రి దేవాలయం శిల్ప, వాస్తు కళను పరిశీలించి, అవి ప్రతిబింబించేలా నిర్మాణాలు చేపట్టాలని సీఎం సూచించారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణాలపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు నిర్మించే ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ లైన్ల మార్పు, వాగుల ప్రవాహం మార్పు, రహదారుల మళ్లింపు, బీఎస్ఎన్ఎల్ లైన్లు, తాగు నీటి సరఫరా లైన్ల మార్పు అంశాలను అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఆయా అంశాలపై పూర్తి వివరాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. విమానాశ్రయాల కాంపౌండ్ వాల్ సమీపం నుంచి రహదారులు నిర్మించాలని, ఆ రహదారులను సమీప జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులకు అనుసంధానం చేయాలని సూచించారు. ఏ శాఖకు ఆ శాఖ విడివిడిగా పనులు చేపడితే, అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. విద్యుత్, ఆర్ అండ్ బీ, తాగు నీటి సరఫరా, నీటి పారుదల శాఖ అధికారులు సమావేశమై బీఎస్ఎన్ఎల్ అధికారులతో చర్చించి, ఏకకాలంలో పనులు సాగేలా చూడాలని సూచించారు. ప్రస్తుత అవసరాలనే కాకుండా భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకొని సమగ్ర ప్రణాళిక రూపొందించుకొని పనులు ముందుకు సాగేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. వాగులు, ఇతర నీటి ప్రవాహాలను మళ్లించాల్సి వస్తే, విమానాశ్రయాల ప్రాంగణం లేదా సమీపంలో చెరువులను నిర్మించి, అక్కడి నుంచి ప్రవాహాలను మళ్లించేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. విమానాశ్రయాలకు వచ్చే, వెళ్లే రహదారులు విశాలంగా ఉండడంతో పాటు సమీపంలోని ముఖ్య రహదారులకు అనుసంధానించేలా నిర్మించాలని సీఎం ఆదేశించారు. నిర్దేశిత సమయంలో పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలతో పాటు ఢిల్లీ తెలంగాణ భవన్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పరిశీలించారు. ప్రతి నిర్మాణంలోనూ తెలంగాణ సంస్కృతి, శిల్ప, వాస్తు కళలకు పెద్దపీట వేయాలని ఆదేశించారు. పలు ఆకృతుల్లో మార్పులను సీఎం సూచించారు. సమీక్షలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, విప్ బీర్ల అయిలయ్య, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, విద్యుత్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శి గంగాధర్, పవర్ గ్రిడ్ ఈడీ డొమన్ యాదవ్, టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఎయిర్ కమోడొర్ రాహుల్ శుక్లా, ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డి, స్థపతి ఈమని శివనాగిరెడ్డి

తదితరులు పాల్గొన్నారు.

# 28 నుంచి థాయ్‌మామన్ తంగ మోదిరం

చెన్నై, సెప్టెంబర్ 22, తమిళనాడులో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మరో సంచలన హామీని నెరవేర్చేందుకు సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించిన ప్రతి చిన్నారికీ ఒక గ్రాము 22 క్యారెట్ల బంగారు ఉంగరాన్ని బహుమతిగా ఇచ్చే 'మేనమామ బంగారు ఉంగరం' (థాయ్‌మామన్ తంగ మోదిరం) పథకాన్ని ఈ నెల 28న సీఎం విజయ్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ ఏడాది జూన్ 22 నుంచి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పుట్టిన ప్రతి శిశువుకూ ఈ పథకాన్ని వర్తింపజేయనుండగా, తొలి విడత పంపిణీ కోసం ఇప్పటికే 1.28 లక్షల ఉంగరాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. మరోవైపు ఉప ఎన్నికలు జరగనున్న మదురాంతకం, ధారాపురం నియోజకవర్గాల్లో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఈ పథకం ప్రారంభానికి ఈసీ తాత్కాలికంగా బ్రేక్ వేసింది.

ఉచిత అల్పాహార పథకం విస్తరణకు మాత్రమే ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చిందని, ఈ బంగారు ఉంగరం పథకానికి అనుమతి లేదని తెలిపింది. తమిళనాడు వ్యాప్తంగా ఏడాదికి నమోదయ్యే దాదాపు 7.8 లక్షల జననాల్లో, సుమారు 4.2 లక్షల మంది పిల్లలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జన్మిస్తున్నారు. వీరందరికీ ఈ పథకం వర్తించనుండగా, ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్కార్ వెల్లడించింది.

# ఇండియా నుంచి భారత్

హైదరాబాద్, సెప్టెంబర్ 22, దేశ రాజకీయాల్లో కొన్ని నాయకత్వాలు ఎన్నికల విజయాలతో గుర్తుండిపోతాయి. మరికొన్ని నాయకత్వాలు పాలనా విధానాల్లో, ప్రజల ఆలోచనా ధోరణిలో తీసుకొచ్చిన మార్పులతో చరిత్రలో నిలిచిపోతాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే.. రెండో కోణం కూడా స్పష్టంగా కనిపిస్తుంది. ప్రధాని పదవి అంటే కేవలం ప్రభుత్వాన్ని నడపడం మాత్రమే కాదనే భావనను మోదీ తన పనితీరుతో ముందుకు తెచ్చారు. ప్రభుత్వ కార్యక్రమాలు, దేశ పర్యటనలు, సమీక్షలు, అంతర్జాతీయ సమావేశాలు, ప్రజా కార్యక్రమాలు.. ఇలా నిరంతర కార్యకలాపాలతో ఆయన రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. వ్యక్తిగత ఆరోగ్యంపై పెద్దగా చర్చకు తావివ్వకుండా విధులకు ప్రాధాన్యం ఇవ్వడం ఆయన నాయకత్వ శైలిలో కనిపించే అంశం. మోదీ పాలనలో మరో ముఖ్యమైన అంశం.. సంప్రదాయ రాజకీయాలను అభివృద్ధి, సంక్షేమం, సామాజిక మార్పుతో అనుసంధానం చేయడం. స్వచ్ఛ భారత్, యోగా, పర్యావరణ పరిరక్షణ, డిజిటల్ సాంకేతికత, పేదల కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలు వంటి అంశాలను ప్రభుత్వ కార్యక్రమాలుగా మాత్రమే కాకుండా ప్రజా ఉద్యమాలుగా మలిచేందుకు ప్రయత్నించారు. ప్రజల భాగస్వామ్యంతోనే దేశ ప్రగతి సాధ్యమనే సందేశాన్ని పదేపదే ముందుకు తెచ్చారు. దేశ ప్రయోజనమే ముందన్న భావనను ప్రజల్లో బలపరచడం కూడా మోదీ రాజకీయ శైలిలోని ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

వ్యక్తి కంటే దేశం, రాజకీయాల కంటే జాతీయ ప్రయోజనం, హక్కులతో పాటు బాధ్యతలు అనే అంశాలను ఆయన ప్రసంగాల్లోనూ, కార్యక్రమాల్లోనూ ప్రస్తావిస్తూ వచ్చారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో కనిపించిన దేశభక్తి, జాతీయ పునర్నిర్మాణ స్ఫూర్తిని కొత్త తరానికి పరిచయం చేసే ప్రయత్నం కూడా ఇందులో భాగమే. 'ఇండియా' నుంచి 'భారత్' వైపు సాగుతున్న చర్చ కూడా ఈ మారుతున్న ఆలోచనా ధోరణికి ఒక ప్రతీకగా మారింది. ఇది కేవలం పేరుకు సంబంధించిన మార్పు కాదు.. దేశపు సాంస్కృతిక మూలాలు, చారిత్రక వారసత్వం, భారతీయ జీవన విధానంపై పెరుగుతున్న దృష్టికి ప్రతిబింబంగా చూడవచ్చు. ఈ పరివర్తనలో మోదీ నాయకత్వం ఒక ముఖ్యమైన పాత్ర పోషించిందనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

# కవిత సమరశంఖం



హైదరాబాద్, సెప్టెంబర్ 22, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ లో కవిత సమర శంఖం పూరించారు. ఆదివారం కొడంగల్ వేదికగా జరిగిన పాంచ జన్య సంకల్ప సభలో కవిత ఓపెన్ గా మాట్లాడారు. ఎటువంటి ఫిల్టర్లు లేకుండా తన అభిప్రాయాన్ని.. మొహమాటం లేకుండా చెప్పేశారు.నేను వాళ్ళు వదిలిన బాణం.. వీళ్ళ వదిన బాణం కాదు. అలాంటి తలకాయ లేని మాటలు మాట్లాడను. అలాంటి వారి కోసం నేను కొడంగల్ గడ్డమీద నుంచి చెబుతున్న. ఇప్పటికీ అధికారానికి.. విద్యకు దూరంగా ఉన్న మా బహుజనుల బాణాన్ని నేను. యువకుల యుద్ధ నినాదాన్ని నేను. వారికోసం మోడీతో కొట్లాడుతా. రేవంత్ రెడ్డితో కొట్లాడుతా. చివరికి కేసీఆర్ తో నైనా కొట్లాడుతా. తద్వారా తన మీద వస్తున్న విమర్శలకు ఈ స్థాయిలో కవిత సమాధానం చెప్పారు. అంతేకాదు తనమీద అవాకులు చవాకులు పేరుతున్న గులాబీ పార్టీ సోషల్ మీడియా.. ఆ పార్టీ అనుబంధ సోషల్ మీడియా గ్రూపులకు కవిత గట్టిగానే కౌంటర్ ఇచ్చారు.వాస్తవానికి కవిత పాంచ జన్య సభలో గట్టిగా మాట్లాడారు. ఒక రకంగా దీనిని ఎన్నికల సభ లాగా ఆమె చాలెంజ్ గా తీసుకొని ప్రసంగించారు.. ప్రారంభం నుంచి చివరి దాకా బహుజనుల విషయాలను ప్రస్తావించారు. తన తండ్రి పరిపాలన కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో మార్పు రాలేదని. ముఖ్యంగా విద్య.. వైద్యం.. ఇతర వాటిల్లో వృద్ధి కనిపించలేదని కవిత క్లారిటీ ఇచ్చారు. విద్య.. వైద్యం వంటివి తమ ప్రధమ ప్రాధాన్యాలు అని కవిత క్లారిటీ ఇచ్చారు. అక్కడితోనే ఆగిపోలేదు.. ఇంకా చాలా విషయాలను కవిత ఈ సభలో చెప్పారు. తన తండ్రి పరిపాలన కాలంలో జరిగిన అవినీతిని.. అక్రమాలను.. తనను బయటికి పంపించిన విధానాన్ని ఆమె వివరించారు.ఇటీవల తన అత్తగారిల్లు అయిన నిజామాబాదులో పాంచ జన్య సభను నిర్వహించిన కవిత.. అక్కడ కన్నీళ్లు పెట్టుకున్నారు. సభలో మాట్లాడుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. కొడంగల్ లో మాత్రం ధైర్యంగా మాట్లాడారు. ప్రభుత్వం మీద ఆరోపణలు చేసిన ఆమె.. చివరికి తన తండ్రిని కూడా వదిలిపెట్టలేదు. అన్నిటికంటే ముఖ్యంగా గులాబీ పార్టీ సోషల్ మీడియాకు దిమ్మతిరిగిపోయేలాగా కవిత రిప్లై ఇచ్చింది. ఒక రకంగా దానిని స్లిప్పర్ షాట్ అని చెప్పవచ్చు. కొద్దిరోజులుగా గులాబీ పార్టీ సోషల్ మీడియా కవిత మీద వ్యక్తిగతంగా దాడి చేసే స్థాయిలో విమర్శలు చేస్తోంది. ఆ విమర్శలకు కవిత ఏర్పాటుచేసిన సోషల్ మీడియా గ్రూపులలో కౌంటర్ ఇస్తున్నప్పటికీ.. గులాబీ పార్టీ సోషల్ మీడియా ఆగడం లేదు. అందువల్లే కొడంగల్ సభ నుంచి కవిత గట్టిగా రిప్లై ఇచ్చారు. మరి దీనికి గులాబీ పార్టీ సోషల్ మీడియా ఎలాంటి కౌంటర్ ఇస్తుందో చూడాలి.

# గ్రాడ్యుయేట్ ఎన్నికల కోసం కసరత్తు షురూ

హైదరాబాద్, సెప్టెంబర్ 22, తెలంగాణ రాష్ట్రంలో మరో ఆసక్తికరమైన రాజకీయ పోరుకు రణభేరి మోగింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ మరియు వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల పదవీకాలం మార్చి 2027తో ముగియనుండటంతో, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధికారికంగా కొత్త ఓటర్ల జాబితా షెడ్యూల్‌ను విడుదల చేశారు. ప్రస్తుత సభ్యులైన సురభి వాణిదేవి , తీన్మార్ మల్లన్న ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ రెండు స్థానాల్లో ఎన్నికల కసరత్తు షురూ కావడంతో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, సీనియర్ పట్టభద్రుల పట్టున్న బీజేపీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా వ్యూహాలకు పదును పెడుతున్నారు.ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన మైలురాయి.. సెప్టెంబర్ 28న విడుదల కానున్న పబ్లిక్ నోటీస్, ఫారం-18 ద్వారా ఓటర్ల నమోదు ప్రారంభం కావడం. గతంలో ఎంతమంది ఓటర్లు నమోదై ఉన్నప్పటికీ, గ్రాడ్యుయేట్ స్థానాల నిబంధనల ప్రకారం పాత ఓటర్ల జాబితా రద్దవుతుంది. ప్రతిసారి కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందే. నవంబర్ 6 వరకు ఫారం-18 స్వీకరించి, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. అంటే, దాదాపు 7 లక్షల మందికి పైగా ఉండే అవకాశం ఉన్న పట్టభద్రుల ఓట్లలో.. ఎవరు ఎక్కువ మంది నిజమైన మద్దతుదారులను ఫారం-18 నింపి ఓటర్లుగా నమోదు చేయించగలుగుతారో, వారికే పోలింగ్ రోజు సగం విజయం ఖాయమవుతుంది.ఈసారి పట్టభద్రుల సమరం చతుర్ముఖ పోటీని తలపిస్తోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాలు, జాబ్ క్యాలెండర్, డీఏ, పెన్షన్ అంశాలను ప్రధాన ప్రచారాస్త్రాలుగా మార్చుకుని నిరుద్యోగులు, ఉద్యోగుల ఓట్లను ఆకర్షించేందుకు ప్లాన్ చేస్తోంది. తమ బలాన్ని నిరూపించుకోవడానికి కాంగ్రెస్ యంత్రాంగం క్షేత్రస్థాయి వరకు ఫారం-18 దరఖాస్తులను చేరవేసి రికార్డు స్థాయిలో ఓటర్లను నమోదు చేయించే పనిలో పడింది. అటు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీకి ఇది అతిపెద్ద అగ్నిపరీక్ష. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తర్వాత గ్రాడ్యుయేట్ వర్గాల్లో ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అమలులో జాప్యం వంటి అంశాలను లేవనెత్తి విద్యావంతులను తమ వైపు తిప్పుకోవాలని చూస్తోంది. గతంలో గెలిచిన మహబూబ్‌నగర్- రంగారెడ్డి-హైదరాబాద్ సీటును నిలబెట్టుకోవడంతో పాటు నల్గొండ-వరంగల్-ఖమ్మంలోనూ బలమైన పోటీ ఇచ్చేందుకు కేటీఆర్, హరీష్ రావులు ప్రత్యేకంగా టీమ్‌లను ఏర్పాటు చేసి ఓటర్ల నమోదు బాధ్యతలను స్థానిక నేతలకు అప్పగిస్తున్నారు.మరోవైపు హైదరాబాద్, రంగారెడ్డి మరియు నల్గొండ పట్టభద్రుల స్థానాల్లో బీజేపీకి సంప్రదాయంగా బలమైన ఓటు బ్యాంకు ఉంది. విద్యావంతులు, ఐటీ నిపుణులు, ఆర్ఎస్ఎస్ అనుబంధ వర్గాల్లో ఆ పార్టీకి మంచి పట్టు ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న మైలేజ్‌తో పాటు రాష్ట్ర సర్కార్ వైఫల్యాలను ఎండగడుతూ అర్బన్ ప్రాంతాల్లో అత్యధికంగా ఆన్‌లైన్ ద్వారా ఓట్లను నమోదు చేయించే వ్యూహంతో బీజేపీ సమాయత్తమవుతోంది. దీనికి తోడు తీన్మార్ మల్లన్న, ఇతర స్వతంత్ర, యువజన సంఘాల నాయకులు కూడా బరిలోకి దిగుతుండటంతో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు అత్యంత ఉత్కంఠభరితంగా మారనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి 'అభ్యర్థి ఇమేజ్' ఎంత ముఖ్యమో.. 'ఓటర్ల నమోదు డిజైన్' అంతకంటే వెయ్యింతలు ముఖ్యం. డిగ్రీ సర్టిఫికేట్లు సేకరించి, గెజిటెడ్ అటెస్టేషన్ చేయించి, గడువులోగా ఫారం-18 అధికారులకు చేరేలా ఏ పార్టీ యంత్రాంగం నెట్‌వర్క్‌ను పక్కాగా నడుపుతుందో.. ఆ పార్టీయే మార్చి 2027 పట్టభద్రుల పోరులో విజేతగా నిలుస్తుంది.

# సింగిల్ విండో అనుమతులు కోసం యత్నాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 22, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ , నూతన హెచ్ఎండీఏ పరిధిలో భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ అప్రూవల్స్ ప్రక్రియను మరింత సరళతరం చేయాలని రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన ప్రముఖ అసోసియేషన్లు ప్రభుత్వాన్ని గట్టిగా కోరుతున్నాయి. ప్రస్తుతం వివిధ విభాగాల నుంచి ఎన్ఓసీలు పొందడంలో జరుగుతున్న జాప్యం, వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా ప్రాజెక్ట్‌ల నిర్మాణం ఆలస్యమవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో అక్రమాలను అరికడుతూ, పూర్తి పారదర్శకతతో కూడిన సేవలు అందించేందుకు ఒక సమగ్ర సింగిల్ విండో వ్యవస్థను తక్షణమే అమల్లోకి తేవాలని డిమాండ్ చేస్తూ వస్తున్నాయి.ప్రస్తుతం అమల్లో ఉన్న ఆన్‌లైన్ అనుమతుల విధానం కొన్ని వెసులుబాట్లు కల్పిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇంకా అనేక సాంకేతిక , అధికారిక ఇబ్బందులు వేధిస్తున్నట్లు డెవలపర్లు వాపోతున్నారు. ఫైళ్లు వివిధ శాఖల చుట్టూ తిరగడం వల్ల వడ్డీ భారం పెరిగి, చివరికి అది ఇళ్ల కొనుగోలుదారులపై అదనపు ఆర్థిక భారంగా మారుతోందని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా అన్ని రకాల క్లియరెన్స్‌లను ఒకే గొడుగు కిందకు తెచ్చే సరికొత్త సింగిల్ విండో విధానం అత్యవసరమని రియల్ ఎస్టేట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.ఈ ప్రతిపాదిత సింగిల్ విండో వ్యవస్థ ద్వారా దరఖాస్తు చేసుకున్న నిర్దిష్ట కాలపరిమితిలోగా అన్ని అనుమతులు మంజూరయ్యేలా నిబంధనలు రూపొందించాలని కోరుతున్నారు. ఫైర్ సేఫ్టీ, రెవెన్యూ, అటవీ, పర్యావరణం , స్థానిక పట్టణాభివృద్ధి సంస్థల నుంచి వేర్వేరుగా అనుమతులు తెచ్చుకునే నరకయాతన తప్పుతుందని, దీనివల్ల చిన్న , మధ్యతరగతి బిల్డర్లకు ఎంతో ఊరట లభిస్తుందని పేర్కొంటున్నారు. పారదర్శకత పెరిగితే ప్రభుత్వానికి వచ్చే ఆదాయంతో పాటు వినియోగదారులకు కూడా సరసమైన ధరల్లో గృహాలు లభించే అవకాశం ఉంటుందని వాదిస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం, సంబంధిత పురపాలక శాఖ ఈ డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, రియల్ ఎస్టేట్ రంగానికి మరింత ఊతమిచ్చేలా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ నగర బ్రాండ్ ఇమేజ్ వేగంగా మారుతున్న తరుణంలో, మౌలిక సదుపాయాల కల్పనలో , అనుమతుల జారీలో ఈ రకమైన ఆధునిక సంస్కరణలు ఎంతైనా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం కనుక సింగిల్ విండో విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తే, దేశవ్యాప్తంగా ఉన్న పెద్ద ఇన్వెస్టర్లు మరెన్నో ప్రాజెక్టులతో భాగ్యనగరం వైపు క్యూ కట్టే అవకాశం ఉంది.

# నల్లేరు మీద నడక అవుతుందా...

## కొత్త అభ్యర్థా

హైదరాబాద్, సెప్టెంబర్ 22, తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లారు దానం నాగేందర్. అయితే ఆయన మొదట సుప్రీంకోర్టుకు వెళ్లనని ఖైరతాబాద్ ఉపఎన్నికను నేరుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. కానీ ఓ చాయిస్ ఉన్నప్పుడు ఎందుకు వదులుకోవడం ఆయన పిటిషన్ వేశారు కానీ..సుప్రీంకోర్టులో ఊరట లభించడం కష్టమేనన్న అభిప్రాయంబలంగా ఉంది. చట్టపరంగా అనర్హత వేటు పడినప్పటికీ, తదుపరి జరిగే ఉపఎన్నికలో పోటీ చేయకుండా నిరోధించే నిబంధన ఏదీ లేదు కాబట్టి దానం నాగేందర్ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగడం దాదాపు ఖాయమైంది. ఈ పరిణామంతో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యం కాగా, ఇక్కడ రాజకీయ పరిస్థితులు పూర్తిగా దానం నాగేందర్ చుట్టూనే తిరుగుతున్నాయి.ఖైరతాబాద్ నియోజకవర్గ చరిత్రను పరిశీలిస్తే.. పార్టీల సిద్ధాంతాల కంటే దానం నాగేందర్ వ్యక్తిగత ప్రభావమే ఇక్కడ ఎక్కువ పనిచేస్తుందని స్పష్టమవుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఏవైనా సరే.. నియోజకవర్గంలోని ప్రతి బస్తీ, డివిజన్ స్థాయి నేతలతో ఆయనకు దశాబ్దాలుగా ఉన్న ప్రత్యక్ష పరిచయాలు, బలమైన అనుచరగణమే ఆయన ప్రధాన బలం. ఖైరతాబాద్‌లో ప్రత్యేకంగా ఏ ప్రతిపక్ష పార్టీకీ బలమైన సంస్థాగత క్యాడర్ నిర్మాణం లేకపోవడంతో, దానం నెట్‌వర్కే ప్రధాన శక్తిగా నిలుస్తోంది. ఇక పార్టీల సమీకరణాల పరంగా చూస్తే, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఖైరతాబాద్‌తో సంప్రదాయబద్ధంగా పాత ఓటుబ్యాంకు ఉంది. దానం నాగేందర్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీకి దిగినప్పుడు.. ఆయన వ్యక్తిగత ఇమేజ్, బస్తీల్లో ఉన్న పట్టుకు తోడు కాంగ్రెస్ పార్టీ సంప్రదాయ ఓటుబ్యాంకు, శ్రేణులు ఏకమవుతాయి. దీనికి తోడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ యంత్రాంగం, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల హోదా తోడవటం దానం నాగేందర్‌కు ఉపఎన్నికలో భారీ అడ్వాంటేజ్‌గా మారే అవకాశం ఉందనేది పొలిటికల్ ట్రెండ్స్ చెబుతున్నాయి.ఈ పరిస్థితి ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు అతిపెద్ద సవాలుగా మారింది. ఖైరతాబాద్‌లో స్థానికంగా దానం స్థాయి బలమైన, నియోజకవర్గమంతా తెలిసి ఉన్న ప్రత్యామ్నాయ నాయకుడు బీఆర్ఎస్‌కు లేకపోవడం పెద్ద లోటు. గతంలో దానంను నమ్ముకునే అక్కడ బీఆర్ఎస్ రాజకీయం నడిచింది. ఇప్పుడు ఆయననే ఎదుర్కొని నిలబడటానికి బలమైన లోకల్ క్యాడర్, సమర్థుడైన అభ్యర్థి దొరకడం గులాబీ పార్టీకి కత్తిమీద సాము లాంటిదే. ప్రభుత్వ బలం, దానం పర్సనల్ క్యాడర్‌ను తట్టుకుని పోరాడటం బీఆర్ఎస్‌కు అంత తేలికైన విషయం కాదుమరోవైపు భారతీయ జనతా పార్టీ పరిస్థితి కూడా ఇక్కడ ఏమంత ఆశాజనకంగా లేదు. గతంలో తెలుగుదేశం పార్టీ తో పొత్తు ఉన్న సమయంలో మాత్రమే బీజేపీ ఈ నియోజకవర్గంలో విజయం సాధించగలిగింది. ఆ తర్వాత ఒంటరిగా పోటీ చేసిన ప్రతిసారి డిపాజిట్ కోల్పోవడం లేదా నామమాత్రపు ఓట్లకే పరిమితమవ్వడం జరిగింది. నగర పరిధిలో ఉనికి ఉన్నప్పటికీ, ఖైరతాబాద్‌లోని స్థానిక బస్తీ ఓటర్లను ఆకట్టుకునే స్థాయి బలమైన కేడర్ గానీ, అభ్యర్థి గానీ బీజేపీకి కూడా పెద్దగా అందుబాటులో లేరు. ఖైరతాబాద్ ఉపఎన్నిక అనివార్యమైన వేళ, మిగిలిన ప్రతిపక్ష పార్టీల వద్ద గట్టి అభ్యర్థులు, బలమైన క్యాడర్ లేకపోవడం దానం నాగేందర్‌కు ప్లస్ పాయింట్‌గా మారుతోంది. చట్టపరమైన తీర్పు దానంకు ప్రతికూలంగా వచ్చినా, ప్రజాక్షేత్రంలో మాత్రం అధికార పార్టీ బలం, తన సొంత ఇమేజ్, స్థానిక బస్తీ ఓటర్ల మద్దతుతో ఆయన మరోసారి విజయం సాధించే అవకాశాలే మెండుగా ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ధియేటర్ల బిజినెస్ లోకి మెగా ఫ్యామిలీ



హైదరాబాద్, సెప్టెంబర్ 22, టాలీవుడ్ టాప్ హీరోలలో కొంత మంది థియేటర్ బిజినెస్‌లో అడుగు పెట్టారు. తమ పేరుతో మల్టీప్లెక్స్‌లు కట్టారు. సూపర్ స్టార్ మహేష్ బాబుకు 'ఏఎంబీ', ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఏమో 'ఏఏఏ', మాస్ మహారాజా రవితేజ 'ఏఆర్‌టీ' అంటూ ప్రేక్షకులకు మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వడానికి మల్టీప్లెక్స్‌లు కట్టారు. అల్లు ఫ్యామిలీ కోకాపేట్‌లో 'అల్లు సినిమాస్' నిర్మించింది. ఇప్పుడు ఈ లిస్టులో మెగాస్టార్ చిరంజీవి అడుగు పెడుతున్నారు. గ్రాండ్ ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయ్యారు.హీరోలు అందరితో మల్టీప్లెక్స్ వ్యాపారంలో భాగస్వామిగా ఉన్న ఏసియన్ సినిమాస్ సంస్థతో చిరంజీవి కూడా థియేటర్ వ్యాపారంలో అడుగు పెట్టేందుకు రెడీ అయ్యారు. ప్రపంచంలోనే అత్యంత భారీ సినిమా స్క్రీన్‌ను హైదరాబాద్ సిటీలో ఏర్పాటు చేయడానికి రెడీ అవుతున్నారు.

అమెరికాలోని జార్జియా రాష్ట్రంలోని పూలర్ ప్రాంతంలో ఉన్న 'రాయల్ సినిమాస్ 14 ఐమాక్స్ డ్యూయల్ లేజర్' స్క్రీన్ ప్రస్తుతానికి ప్రపంచంలోనే అతి పెద్ద స్క్రీన్. ఆ రికార్డు దాని పేరిట ఉంది. ఆ స్క్రీన్ 101 అడుగుల వెడల్పు, 76.2 అడుగుల ఎత్తుతో ఉంటుంది. ఆ థియేటర్ దాదాపు 7,696 చదరపు అడుగుల భారీ వైశాల్యంలో విస్తరించి ఉంది. అంతే కాదు... ఆ థియేటర్‌లో 363 రెక్లైనర్ సీట్లు ఉన్నాయి. హైదరాబాద్‌లో అంత కంటే పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేయడానికి చిరంజీవి - ఏసియన్ సినిమాస్ సంస్థ రెడీ అవుతోందని సమాచారం. సేమ్ అటువంటి స్క్రీన్ లేదంటే దాని కంటే ఒక్క ఇంచ్ ఎక్కువ ఉన్న స్క్రీన్ ఏర్పాటుకు సన్నాహాలు మొదలు అయ్యాయి.చిరంజీవి - ఏసియన్ సినిమాస్ సంస్థ భాగస్వామ్యంలో ఏర్పాటు కాబోయే స్క్రీన్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో అధికారికంగా వెల్లడించనున్నారు. అది గనుక రెడీ అయితే... ఇండియాలో మాత్రమే కాదు, ప్రపంచంలో హైదరాబాద్ సిటీకి ప్రత్యేక గుర్తింపు వస్తుంది.

# కేసీఆర్ భూముల వివాదం చంద్రబాబు జపం



హైదరాబాద్, సెప్టెంబర్ 22, రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా కేసీఆర్ భూములపై సమగ్ర విచారణ చేపడుతామని స్పష్టమైన ప్రకటన చేసిన తర్వాత, తెలంగాణ రాజకీయాల్లో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ భూముల వివాదంలో పూర్తిగా ఇరుక్కుపోయిన గులాబీ పార్టీ, ఆ ఉచ్చు నుంచి బయటపడేందుకు సరికొత్త సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించాలని చూస్తున్నదన్న వాదన రాజకీయ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ముఖ్యంగా కేసీఆర్, కేటీఆర్ ఫామ్ హౌజ్ భూములు, వాటి కేటాయింపులపై పెద్దఎత్తున చర్చ జరుగుతుండటంతో, ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీఆర్ఎస్ నాయకులు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారన్న చర్చ జరుగుతోంది.అయితే, ప్రధానంగా కేసీఆర్ , కేటీఆర్ భూముల చుట్టూ వివాదం నడుస్తున్నప్పటికీ, బీఆర్ఎస్ మాత్రం పూర్తిగా చంద్రబాబు జపం వైపు మళ్లడం గమనార్హం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా నీళ్లు వదిలేస్తున్నారని, గురుదక్షిణ కింద తెలంగాణ హక్కులను తాకట్టు పెడుతున్నారని కేటీఆర్, హరీష్ రావు, జగదీశ్వర్ రెడ్డి వంటి సీనియర్ నేతలందరూ ఒకే గళంతో తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇటీవల భూముల అక్రమాలపై రేవంత్ రెడ్డి స్వయంగా ఈ ముగ్గురు నేతల పేర్లను ప్రస్తావిస్తూ తీవ్రమైన ఆరోపణలు చేసిన నేపథ్యంలోనే ఈ పరిణామం చోటుచేసుకుంది. రేవంత్ సంధించిన ప్రశ్నలకు నేరుగా, వాస్తవాలతో కూడిన సమాధానం చెప్పలేకనే బీఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగానే ఏపీ అంశాన్ని తెరపైకి తెచ్చి చంద్రబాబును టార్గెట్ చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.నిజానికి, గత కొంతకాలంగా బీఆర్ఎస్ అనుసరిస్తున్న రాజకీయ శైలి ఇదే రీతిలో సాగుతోంది. తమపై అవినీతి లేదా భూ ఆక్రమణల ఆరోపణలు వచ్చిన ప్రతిసారీ, కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని బీఆర్ఎస్ ఎదురుదాడికి దిగుతోంది. కానీ తాజా పరిణామాలను పరిశీలిస్తే, రేవంత్ రెడ్డిపై డైవర్షన్ పాలిటిక్స్ అంటూ ఆరోపణలు చేస్తున్న గులాబీ పార్టీ నేతలే స్వయంగా ఆ వ్యూహాన్ని అమలు చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. పార్టీ అధినేత కుటుంబాన్ని, కీలక నేతలను చుట్టుముట్టిన భూముల వివాదాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే ఈ సెంటిమెంట్ రాజకీయాలు తెరపైకి తెచ్చారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.

## మాదాపూర్లో యువతి అనుమానాస్పద మృతి

హైదరాబాద్ మాదాపూర్ ఓయో హోటల్లో యువతి అనుమానాస్పద మృతి చెందింది. మృతురాలు విశాఖపట్నానికి చెందిన షారన్ నిఖిత టోప్నో (23). ప్రియుడు శ్రీనివాస రవితేజతో కలిసి హైదరాబాద్కు వచ్చి మాదాపూర్ సిద్ధిఖీ నగర్ రోడ్డు నంబర్-5లోని ఓయో హోటల్ రూమ్ నం.303లో నిన్న దిగింది. మంగళవారం యువతిని ఆమె ప్రియుడు శ్రీనివాస రవితేజ, హోటల్ సిబ్బంది కలిసి అత్యవసర చికిత్స నిమిత్తం కొండాపూర్ లోని ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆమెను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆసుపత్రి సిబ్బంది మాదాపూర్ పోలీసులకు ఫోన్ చేసి చెన్పారు. పోలీసులు వెంటనే ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి.. మృతురాలి ముఖం, తలపై తీవ్రమైన గాయాలు, వాపులు ఉన్నట్లు గుర్తించారు. యువతి మృతి చెందినట్లు తెలియగానే ప్రియుడు ఆసుపత్రి సిబ్బందికి కంటపడకుండా అక్కడి నుంచి పరారైయాడు. హోటల్ గదిని పరిశీలించి, అక్కడి గోడలు, బెడ్ షీట్ పై రక్తపు మరకలను గుర్తించి.. నిందితుడు శ్రీనివాస రవితేజ కోసం గాలిస్తున్నారు.

# ఖైరతాబాద్ నుంచి సాయికిరణ్ పోటీ...?



హైదరాబాద్, సెప్టెంబర్ 22, తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఖైరతాబాద్ నియోజకవర్గం ఉపఎన్నిక వ్యవహారం కీలక చర్చనీయాంశంగా మారింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించిన దానం నాగేందర్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజక వర్గానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. పార్టీ మారిన ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలని బీఆర్ఎస్ న్యాయ పోరాటం చేసింది. చివరకు ఆయనపై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేస్తూ తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇవాళ లేదంటే రేపు సుప్రీంకోర్టులో తీర్పు వచ్చే అవకాశం ఉంది. అయితే, హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు న్యాయనిపుణులు పేర్కొంటున్నారు. అదే జరిగితే ఖైరతాబాద్ ఉపఎన్నిక అనివార్యమైనట్లే. ఇప్పటికే బీఆర్ఎస్ అధిష్టానం ఖైరతాబాద్ నియోజకవర్గంపై దృష్టిసారించింది. ఉపఎన్నిక వస్తే బరిలో ఎవరిని నిలపాలనే అంశంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యనేతలతో చర్చించినట్లు సమాచారంఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో విజయం సాధించి అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ ఇవ్వాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ఈ క్రమంలో అభ్యర్థి ఎంపికపై ఆచితూచి అడుగులు వేయాలని గులాబీ పార్టీ అధిష్టానం డిసైడ్ అయింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌లో ఖైరతాబాద్ టికెట్ ఆశిస్తున్న నేతలు.. ఎవరి ప్రయత్నాల్లో వాళ్లు బిజీ అయిపోయారు. ప్రముఖంగా పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మన్నె గోవర్ధన్ రెడ్డి, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు సాయికిరణ్ యాదవ్ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే, సాయికిరణ్ యాదవ్‌ను బరిలోకి దింపాలనే ఆలోచనలో బీఆర్ఎస్ అధిష్టానం ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో అభ్యర్థి ఎంపికపై కేసీఆర్ పార్టీ ముఖ్యనేతలతో చర్చించినట్లు సమాచారం. ఈ క్రమంలో తసాని శ్రీనివాస్ యాదవ్ కుమారుడు సాయి కిరణ్ కు టికెట్ ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తసాని శ్రీనివాస్ యాదవ్ కు ఫోన్ చేసి ఖైరతాబాద్ ఉప ఎన్నికలో సాయికిరణ్ ను పోటీకి పెట్టేందుకు సిద్ధం కావాలని కేసీఆర్ సూచించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. సాయికిరణ్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన తొలి లోక్ సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యాడు. గత ఎన్నికల్లోనూ అదే పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలని భావించినప్పటికీ.. చివరి నిమిషంలో అధిష్టానం ఆ స్థానం నుంచి పద్మారావుగౌడ్ ను బరిలోకి దింపింది. అయితే, తలసాని శ్రీనివాస్ యాదవ్ కు ఖైరతాబాద్ నియోజకవర్గంలో గట్టి పట్టుంది. మంత్రిగా ఈ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనుల్లో తలసాని కీలకంగా వ్యవహరించడం కలిసి వస్తుందని బీఆర్ఎస్ అధిష్టానం భావిస్తోంది. దీనికితోడు తలసాని సామాజిక వర్గంకు చెందిన ఓటర్లతోపాటు ఇతర బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ఈ నియోజకవర్గంలో ఎక్కువగా ఉండటంతో పాటు.. వీరిలో ఎక్కువశాతం తలసాని కుటుంబానికి సానుకూలంగా ఉండటంతో బీఆర్ఎస్ అధిష్టానం సాయికిరణ్‌ను బరిలోకి దింపేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

# బంగారు నల్ల పూసల గొలుసు చోరీ
## ఇద్దరు బెడ్ రోల్ అటెండర్స్ అరెస్ట్

సికింద్రాబాద్. వజ్రపు లాకెట్ తో ఉన్న బంగారు నల్ల పూసల గొలుసు చోరీకి పాల్పడిన ఇద్దరు బెడ్ రోల్ అటెండర్స్ ను రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి వారి నుండి లక్షా యాభై వేల విలువైన నగను యదాతదంగా స్వాదీనం చేసుకొని రిమాండ్ కు తరలించారు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ ఎస్ ఎన్ జావేద్ మాట్లాడుతూ థారు ఒ సన్స్ బెడ్ రోలర్ సరఫరాదారుల ఆధ్వర్యంలో బీహార్ చెందిన రాహుల్ కుమార్, సురేష్ పాశ్వాన్ దురంతో ఎక్స్ ప్రెస్ రైల్ లో బెడ్ రోలర్ అటెండెర్లుగా పని చేస్తున్నారు. ఇద్దరు కలసి మద్యం సేవించడం, సిగరెట్లు త్రాగడం వంటి దురలవాట్లకు అలవాటు పడ్డారు. తమ ఉద్యోగం ద్వారా వస్తున్న డబ్బులు సరిపోకపోవడంతో సులభంగా డబ్బులు సంపాదించడం కోసం ప్రయాణికుల విలువైన వస్తువులు దొంగిలించాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అందులో భాగంగా ఈ నెల 16న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కు చేరుకున్న దురంతో ఎక్స్ ప్రెస్ రైల్ లో దుప్పట్లు సేకరిస్తున్న రాహుల్ కు అందులో వజ్రపు లాకెట్ ఉన్న బంగారు పూసల గొలుసు లభించింది. దానిని సురేష్ తో కలసి అమ్మి వచ్చిన డబ్బులను అవసరాలు తీర్చు కోవడానికి సిద్దామయ్యారు. అయితే బాధితుడి పిర్యాదు మేరకు జీఆర్పీ సికింద్రాబాద్ ఇన్ స్పెక్టర్ సాయి ఈశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో జీ ఆర్పీ పోలీసులు, ఆర్పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేసి నిందితులు ఇద్దరిని గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించగా ఈ తతంగమంతా బయట పడిందని వెల్లడించారు.

## డ్రగ్స్ ముఠా అరెస్ట్

సికింద్రాబాద్: ఈజీ మనీకి అలవాటు పడి డ్రగ్స్ అమ్ముతున్న రాజస్థాన్ కు చెందిన ముఠాను మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు.. విక్రయిస్తున్న వ్యక్తి మహావీర్ సింగ్ తో పాటు వినియోగదారుడు లక్ష్మణ్ సింగ్ ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.. రాజస్థాన్ నుండి సరఫరా చేస్తున్న కుల్దీప్ పరారీ లో ఉన్నారని పోలీసులు తెలిపారు... నిందితుల వద్ద 23 గ్రాముల ఓఆఓం డ్రగ్స్ తో పాటు మొబైల్ ఫోన్స్, క్యాష్ స్వాధీనం చేసుకున్నారు... డ్రగ్స్ అమ్మినా, వినియోగించిన చట్టపరమైన చర్యలు ఉంటాయని మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ హెచ్చరించారు... డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని డీసీపీ సూచించారు..

## గిరిజనుల హక్కుల కోసం ఐక్య పోరాటాలను బలోపేతం చేయాలి

### గిరిజన సంఘం(టీజీఎస్) రాష్ట్ర కార్యదర్శి రమావత్ శ్రీరామ్ నాయక్



మహబూబాబాద్: తెలంగాణ గిరిజన సంఘం (T–S) మహబూబాబాద్ జిల్లా 4వ మహాసభను ఉద్దేశించి గిరిజన సంఘం (టీజీఎస్) రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ్ నాయక్ మాట్లాడుతూ... గిరిజనులు ఎదుర్కొంటున్న భూమి, అటవీ హక్కులు, ఉపాధి, విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. గిరిజనుల హక్కుల కోసం గతంలో జరిగిన పోరాటాల స్ఫూర్తితో నేటి సమస్యలపై కూడా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గిరిజనుల భూములకు రక్షణ కల్పించడం, పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం, అటవీ హక్కుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం, గిరిజన ప్రాంతాల్లో విద్యా?వైద్య సదుపాయాలను మెరుగుపరచడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధి అవకాశాల లేనీ కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వరకు టీజీఎస్ గిరిజన సంఘం నిరంతరం ప్రజల పక్షాన నిలబడుతుందని తెలిపారు. గిరిజనుల హక్కుల సాధన కోసం గ్రామస్థాయి నుంచి సంఘాన్ని బలోపేతం చేయాలని, యువత, మహిళలను ఉద్యమాల్లో భాగస్వాములను చేయాలని శ్రీరామ్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మహాసభలో జిల్లా ప్రజా సంఘాల,నాయకులు, మండల, ప్రజా సంఘాల నాయకులు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# 58 గ్రామపంచాయతీలకు రూ.33.62 కోట్లు విడుదల: మంత్రి సీతక్క

హైదరాబాద్ తెలంగాణ కోర్టు కేసులు, ఇతర కారణాల వల్ల ఎన్నికలు జరగని 58 గ్రామపంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.33.62 కోట్లు విడుదల చేసిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఎన్నికలు జరగలేదన్న కారణంతో కేంద్ర ఆర్థిక సంఘం నుండి నిధులు అందకపోయినా, గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా నిధులు సమకూర్చినట్లు విలేకరుల సమావేశంలో చెప్పారు. ప్రతి పంచాయతీని మాడల్ పంచాయతీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

# బద్వేల్‌లో మరో రహదారి అభివృద్ధికి శ్రీకారం




బద్వేలు బద్వేల్ మున్సిపాలిటీ:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కడప రోడ్డు నుంచి భాకరాపేట వరకు 2.3 కిలోమీటర్ల రహదారి నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మరియు ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన మంచూరు సూర్యనారాయణ రెడ్డి విచ్చేసి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.1.26 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నారు. రహదారి నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు, బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలో రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. బద్వేల్ నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంచూరు సూర్యనారాయణ రెడ్డి తెలిపారు.

# కరీంనగర్ టెండర్లలో 'సిండికేట్' కలకలం

**రూ.50 కోట్ల జఎఆఈ పనులపై రాజకీయ దుమారం**

**- సింగిల్ టెండర్లపై అనుమానాలెందుకు?**

**- అధికార?ప్రతిపక్షాల మౌనంపై ప్రశ్నలు**

**- టెండర్లు రద్దు చేసి సమగ్ర విచారణ జరపాలంటున్న వామపక్షాలు**

**- బండి సంజయ్ ఎలా స్పందిస్తారోనని నగరవాసుల ఎదురుచూపు**

కరీంనగర్ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత ద్వితీయ శ్రేణి నగరాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా కరీంనగర్ ముందుకు సాగుతోంది. స్మార్ట్ సిటీ, జఎఆఈ తదితర పథకాల కింద భారీగా నిధులు రావడంతో నగరంలో రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. అయితే కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించే ఈ పనుల టెండర్ ప్రక్రియపై తాజాగా ఆరోపణలు, అనుమానాలు తెరపైకి రావడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జఎఆఈ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లలో పోటీ పరిమితం కావడం, కొన్ని పనులకు సింగిల్ బిడ్లు రావడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పలు జఎఆఈ పనులకు ఒక్కో బిడ్డర్ మాత్రమే పాల్గొన్నట్లు అందుబాటులో ఉన్న టెండర్ రికార్డులు చూపిస్తున్నాయి. రూ.50 కోట్ల పనులు.. సింగిల్ టెండర్లపై చర్చజఎఆఈ పథకం కింద కరీంనగర్ కార్పొరేషన్‌కు సంబంధించిన సుమారు రూ.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులపై నగరంలో చర్చ జరుగుతోంది. ఈ నిధులతో రోడ్లు, డ్రెయిన్లు, సీసీ రోడ్లు, ఇతర మౌలిక వసతుల పనులు చేపట్టనున్నారు. ఇటీవలే ఈ పథకం కింద రూ.50 కోట్లతో నగరంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడించినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇంత పెద్ద మొత్తంలో ప్రజాధనం వెచ్చిస్తున్న సమయంలో ప్రతి పనికి తగినంత పోటీ ఉండేలా టెండర్ ప్రక్రియ జరిగిందా? సింగిల్ బిడ్లు ఎందుకు వచ్చాయి? కాంట్రాక్టర్ల మధ్య పోటీ ఎందుకు కనిపించలేదు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కొన్ని జఎఆఈ పనుల టెండర్ రికార్డుల్లో ఒక్క బిడ్డర్ మాత్రమే పాల్గొన్న సందర్భాలు కూడా నమోదయ్యాయి. ఉదాహరణకు కిసాన్‌నగర్‌లోని ఒక జఎఆఈ పనికి ఒక బిడ్డర్ మాత్రమే పాల్గొన్నట్లు టెండర్ డేటా పేర్కొంటోంది.

# అంగన్వాడీ టీచర్ బండారి ఉమామహేశ్వరి మృతి పట్ల సంతాపం



కురవి మండల కేంద్రానికి చెందిన అంగన్వాడీ టీచర్ బండారి ఉమామహేశ్వరి గుండెపోటుతో మృతిచెందడంతో, వారి పార్థివ దేహానికి కురవి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ గౌడ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కురవి సమన్వయ కమిటీ అధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు అంబటి వీరభద్ర గౌడ్ , ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ సభ్యులు గొల్లపల్లి రజనీకాంత్ , మండల ఉపాధ్యక్షులు బానోత్ తుకారం నాయక్ గారు, వాగ్య నాయక్ , దొంగల జనార్దన్ రెడ్డి , మండల ప్రధాన కార్యదర్శి లింగ నాయక్ , మండల కార్యదర్శి బండి మల్లయ్య , మండల యూత్ అధ్యక్షులు దడిగల శరత్ , ఆలయ ధర్మకర్త చిన్నం గణేష్ , ఉప సర్పంచ్ దయ్యాల శ్రీధర్ , గ్రామ అధ్యక్షులు రాముల వెంకన్న, వార్డు సభ్యులు మోహన్ మాజీ వార్డు సభ్యులు లక్ష్మణ్ నాయక్ తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం..

### 374 మంది రైతులకు రూ.15 లక్షల వడ్డీ లేని రాయితీ చెక్కుల పంపిణీ..

చందర్లపాడు: మండలంలోని కోనయపాలెం గ్రామంలో మంగళవారం గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) ఆధ్వర్యంలో రైతులకు వడ్డీ లేని రాయితీ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్, కూటమి నేతలు, అధికారులతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య గారు పాల్గొని 374 మంది రైతులకు మొత్తం రూ.15 లక్షల విలువైన వడ్డీ లేని రాయితీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గారు మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతులకు పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రైతుల్లో భరోసాను నింపుతున్నాయని ఎమ్మెల్యే సౌమ్య గారు అన్నారు. కార్యక్రమంలో లాల్ బహుదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు,అధికారులు, సహకార సంఘం సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవారి గరుడసేవలో ఆర్టీసీ సేవలు అభినందనీయం.

### జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావుకు సత్కారం..?

తిరుపతి: సెప్టెంబర్ 22,గత శనివారం తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగిన గరుడసేవకు ఆర్టీసి అధికారులు పక్కా ప్రణాళికతో బస్సులను నడిపి, ప్రయాణీకులకు అత్యంత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఆర్.ఎం. శ్రీనివాస రావును ఆర్టీసీ నాయకులు అంబేద్కర్ స్టార్ కృష్ణ, ఆవుల ప్రభాకర్ యాదవ్, వర్మ, శ్రీనాథ్ తదితరులు ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కండువాతో సత్కరించి ఘనంగా అభినందించారు. ?ఈ విజయవంతమైన ప్రస్థానంలో నెల్లూరు ఈడీ జగదీష్, డిప్యూటీ సీటీఎం విశ్వనాథ్, డిప్యూటీ సీఎంఈ బాలాజీ, అన్ని డిపోల మేనేజర్లు మరియు అన్ని స్థాయిల ఉద్యోగులు, ముఖ్యంగా డ్రైవర్, కండక్టర్లు సమన్వయంతో పని చేసి గరుడసేవను దిగ్విజయవంతం చేశారని నాయకులు కొనియాడారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించి, వచ్చే నెలలో నిర్వహించబోయే శ్రీవారి బ్రహ్మోత్సవాలను కూడా విజయవంతం చేయాలని ఆర్.ఎం. శ్రీనివాసరావు ఈ సందర్భంగా అందరినీ కోరారు.

## ఏఐటీయూసీ రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రాల ఆవిష్కరణ




చిట్వేలి రైల్వేకోడూరు బత్యాల భవన్‌లో ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించనున్న తిరుపతి జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం రైల్వే కోడూరు పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గ అధ్యక్షుడు మాదరాజు గంగాధర్, ప్రధాన కార్యదర్శి దాసరి జయచంద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1920లో ఏర్పడిన ఏఐటీయూసీ 106 ఏళ్లుగా కార్మికుల హక్కుల కోసం పోరాడుతోందన్నారు. కార్మిక చట్టాలను పరిరక్షించడంతో పాటు నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ, పారిశుధ్య కార్మికులు తెల్లవారు జామునే విధులకు హాజరై ప్రజలకు పారిశుధ్య సేవలు అందిస్తున్నప్పటికీ వారికి రక్షణ పరికరాలు, బీమా, కనీస వేతనం, ఉద్యోగ భద్రత వంటి సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందడం లేదని వారు అన్నారు. కార్మికులకు రక్షణ పరికరాలు, హెల్త్‌కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్, కనీస వేతనం రూ. 26 వేలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై చర్చించేందుకు నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతులకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా కార్మికులు హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు సుధాకర్, రాజేష్, పెంచలయ్య, గజ, కిషోర్, పెంచలమ్మ, పార్వతి, లక్ష్మీదేవి, మహేష్ పాల్గొన్నారు.

## ఎల్‌నినో కారణంగా రైతు కుటుంబాలకు నెలకు పదివేలు ఇవ్వాలి



చిట్వేలి ఎల్‌నినో ప్రభావంతో నైరుతి ఋతుపవనాల సమయంలో లోటు వర్షపాతం నమోదైనది అని రాష్ట్ర రైతు సంఘం నాయకుడు మలిశెట్టి రాహుల్ అన్నారు. చిట్వేలి మండలం వెంకటరాజు పల్లిలో ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో కారణంగా రైతులు పంట వేయలేక, వేసిన పంటలను నీటి కొరతతో కాపాడుకోలేక నష్టపోతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తి అవగాహన ఉందని. వారు వీలైన పరిధిలో ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే అన్నారు. కానీ ఈ ఎల్‌నినో ప్రభావం ఈశాన్య రుతుపవనాల పైన ఉంటుంది కావున 2027లో నైరుతి రుతుపవనాలు వరకు ప్రతి రైతు కుటుంబానికి నెలకు పదివేల రూపాయలు ఇచ్చి రైతులను కరువు నుండి కాపాడాలని కోరారు. వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఏ విధంగా ఆర్థిక సహాయం అందిస్తున్నారో అదేవిధంగా ఈ కరువును ప్రకృతి విపత్తుగా తీసుకొని 2027 వరకు ప్రతి నెలకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం, ప్రతి రైతు కుటుంబానికి అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. గాలేరు - నగిరిని త్వరితగతిన పూర్తి చేసి కడప, రాజంపేట, కోడూరు, తిరుపతి ప్రాంతాల చెరువులకు నీటిని నింపడం ద్వారా ఇటువంటి కరువు సమయాలకు భూమిలో నీటిమట్టం పూర్తిగా తగ్గకుండా నీటి లభ్యత ఉంటుంది కావున గాలేరు- నగరి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని రైతు సంఘం నాయకుడు మలిశెట్టి రాహుల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రామచంద్ర, నారాయణ, శివయ్య, చంగయ్య, నాగేశ్వర, బాబు పాల్గొన్నారు.

## నగరి, పుత్తూరు నియోజకవర్గాల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా విస్తృత పర్యటన...

### కార్యకర్తల మృతి పార్టీకి తీరని లోటు..



నగరి: సెప్టెంబర్ 22, రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, కానీ పార్టీని నమ్ముకుని నిరంతరం శ్రమించే కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి ఆర్.కె. రోజా పేర్కొన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం సైనికులా పనిచేసిన కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలవాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందని ఆమె ఉద్ఘాటించారు.?ఇందులో భాగంగానే ఆమె నగరి మున్సిపాలిటీ మరియు పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి, ఇటీవల కాలంలో ఆకస్మికంగా మరణించిన వైయస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను నేరుగా వారి నివాసాలకే వెళ్లి పరామర్శించారు. నగరి మున్సిపాలిటీ కాకవేడులో పరామర్శ....?నగరి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు కాకవేడులో వైయస్ఆర్సీపీ ముస్లిం మైనారిటీ నాయకులు కాజా బాయ్ చిన్నాయన ఖాదర్ భాషా మరణించిన విషయం తెలిసిందే. ఈ దుఃఖకర సందర్భంలో మాజీ మంత్రి ఆర్కే రోజా కార్యకర్త నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఖాదర్ భాషా పార్టీకి అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, పార్టీ పరంగా అన్ని విధాల అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు.? పుత్తూరు రూరల్ మండలం లోని వేణుగోపాలపురం నందు వైయస్ఆర్సీపీ నాయకుడు శేఖర్ మామ ఇటీవల మృతి చెందడంతో, వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఆత్మీయంగా ఓదార్చారు.ప్రజలతో మమేకమైన నేత....నగరి మరియు పుత్తూరు మున్సిపాలిటీలలో ఏ చిన్న కష్టం వచ్చినా ఏ కుటుంబానికి విషాదం ఎదురైనా తాను స్వయంగా వారి వద్దకు వెళ్లి ఓదార్చడం రోజా ప్రత్యేకత. ఈ పర్యటనలో స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నాయకురాలు మానవతా దృక్పథాన్ని కొనియాడారు.

## రేణిగుంటలో శ్రీ బాలాజీ మెడికల్ కాలేజీలో ఘనంగా 6వ జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలు....

### ఔషధాల హేతుబద్ధమైన వినియోగం పై అవగాహన...

### ఉత్సాహంగా విద్యార్థుల వాక్ థాన్......

### సురక్షితమైన ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ఫార్మాకో విజిలెన్స్ వారోత్సవాలు.....

రేణిగుంట: సెప్టెంబర్ 22, వైద్య రంగంలో ఔషధాల సురక్షిత వినియోగంపై ప్రజల్లో మరియు విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు రేణిగుంట శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ మరియు రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో 6 వ జాతీయ ఫార్మాకో విజిలెన్స్ వారోత్సవాలు అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సెప్టెంబర్ 22వ తేదీన ప్రత్యేకంగా ఒక భారీ వాక్ థాన్ నిర్వహించారు. ఫార్మాకో విజిలెన్స్ ద్వారా ఔషధాల హేతుబద్ధమైన వినియోగాన్ని ప్రోత్సహిద్దాం... సురక్షితమైన ఆరోగ్య సంరక్షణకు ఒక అడుగు"అనే నినాదంతో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. మందులను ఇష్టానుసారంగా వాడడం వల్ల కలిగే నష్టాలు, వాటి సరైన మోతాదు మరియు దుష్ప్రభావాలపై అవగాహన కల్పించే ఫ్లకార్డులను విద్యార్థులు ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో వైద్య విద్యార్థులు విశేష ఉత్సాహాన్ని కనబరిచారు. ఎంబిబిఎస్, బిపిటి మరియు నర్సింగ్ విద్యార్థులతో పాటు పలువు అధ్యాపకులు ఈ వాక్ థాన్ లో భాగస్వాములయ్యారు. ప్రతి ఒక్కరూ ఔషధ సురక్షిత వాడకంపై నినాదాలు చేస్తూ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా సంస్థ డీన్ ఎం హనుమంతరావు డైరెక్టర్ ఎం నాగరాజు జేఈవో డాక్టర్ ఎం నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో వైద్య సేవలతో పాటు మందుల దుర్వినియోగాన్ని అరికట్టడం ఎంతైనా అవసరమని పేర్కొన్నారు. ఫార్మా కాలేజీ విభాగ ప్రొఫెసర్ హెడ్ మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ సి మాధవ్ మాట్లాడుతూ ఫార్మా కోవిజిలెన్స్ ప్రాముఖ్యతను ఔషధాల వల్ల కలిగే దుష్ప్రభావాలను ఏ విధంగా ఎప్పటికప్పుడు ఎలా రిపోర్ట్ చేయాలో వివరించారు.




## సింగరాజుపల్లిలో ఘనంగా 9వ జాతీయ పోషణ మహోత్సవాలు



కొత్తపల్లి సింగరాజుపల్లి అంగన్వాడీ కేంద్రంలో 9వ జాతీయ పోషణ మహోత్సవాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు సమతుల్యమైన పోషకాహారం అందించడం ఎంతో అవసరమని తెలిపారు. పోషకాహారం లోపించడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు.ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలను తప్పనిసరిగా భాగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మునగాకు, కరివేపాకును ఆహారంలో విరివిగా ఉపయోగించడం ద్వారా రక్తహీనతను నివారించడంతో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చని వివరించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో వివిధ పోషకాహార పదార్థాలతో పోషకాహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ హరిత, హెల్పర్ సుభాషిని, లబ్ధిదారులు చంద్రకాంత్, విజయుడు, వరప్రసాద్, శివారెడ్డి, లక్ష్మీదేవి, త్రివేణి, రత్నమ్మ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవారి రథోత్సవం

### భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగిన భక్తులు

### గోవిందనామస్మరణతో మారుమోగిన తిరుమాడ వీధులు



తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన మంగళవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని రథాన్ని లాగి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారిని మహోన్నత రథంపై అధిష్ఠింపజేసి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. స్వామివారు రథంపై విహరిస్తుండగా భక్తులు అడుగడుగునా హారతులు సమర్పిస్తూ, "గోవిందా.. గోవిందా" అంటూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.గోవిందనామస్మరణతో తిరుమాడ వీధులు మారుమోగాయి.ఆర్ష సంప్రదాయంలో రథోత్సవానికి విశిష్ట స్థానంఅనాదికాలం నుంచి రాజులకు రథసంచారం ప్రసిద్ధమైంది. యుద్ధాల్లోనూ రథాలను విరివిగా ఉపయోగించినట్లు భారతాది ఇతిహాసాలు, పురాణాలు వివరిస్తున్నాయి. శ్రీహరి గరుడధ్వజుడై నాలుగు గుర్రాలతో కూడిన రథంపై విహరిస్తాడని ఆర్ష గ్రంథాలు పేర్కొంటున్నాయి. ప్రసిద్ధ దేవాలయాల్లో ఉత్సవమూర్తులను రథంపై అధిష్ఠింపజేసి ఊరేగించే సంప్రదాయం ఆగమశాస్త్ర సమ్మతంగా కొనసాగుతోంది."రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే"తిరుమల శ్రీవారి రథోత్సవం విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. "రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే" అనే ఆర్షవాక్యం రథంపై కొలువుదీరిన శ్రీకేశవుని దర్శనం పరమపవిత్రమైనదని తెలియజేస్తోంది.భక్తులు రథానికి కట్టిన తాళ్లను పట్టుకుని స్వామివారి రథాన్ని ముందుకు లాగుతూ భక్తి పరవశ్యంలో మునిగిపోయారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, రథోత్సవం సురక్షితంగా జరిగేలా టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.రథోత్సవంలో అంతర్లీనమైన ఆత్మతత్త్వంరథోత్సవానికి విశిష్టమైన తాత్త్విక సందేశం కూడా ఉంది. కఠోపనిషత్తులో ఆత్మను రథికుడిగా, శరీరాన్ని రథంగా, బుద్ధిని సారథిగా, మనస్సును పగ్గాలుగా, ఇంద్రియాలను గుర్రాలుగా అభివర్ణించారు. ఇంద్రియాలకు విషయాలే మార్గాలుగా పేర్కొంటూ ఆత్మ?అనాత్మ వివేకాన్ని ఉపదేశించింది.రథోత్సవం భక్తులకు ఈ ఆధ్యాత్మిక తత్త్వాన్ని గుర్తుచేస్తుంది. భక్తులు రథాన్ని లాగుతున్నప్పటికీ, సకల జీవుల్లో అంతర్యామిగా ఉన్న పరమాత్మ తన భక్తులను అనుగ్రహిస్తూ తన రథాన్ని తానే నడిపిస్తున్నాడనే భావన ఈ ఉత్సవంలో అంతర్లీనంగా ఉంది

# శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాశ్రమంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు

## బాసర సెప్టెంబర్ 22:బాసర సరస్వతి సన్నిధి లో సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో బాసర క్షేత్రంలోని జ్ఞాన సరస్వతి దేవాలయ సమీపంలో గల శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ ము కోటి పార్థివశివలింగ శ్రీ మేధా దక్షిణామూర్తి సహిత ద్వాదశ జ్యోతిర్లింగమందిర మాసోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా దీపారాధన, కలశ స్థాపన ,విఘ్నేశ్వరశ్వర పూజ ,కోటి పార్థివ లింగ , శ్రీ మేధా దక్షిణామూర్తి సహిత ద్వాదశ జ్యోతిర్లింగములకు మహా రుద్రాభిషేకం పుష్పార్చన , బిల్వార్చన , గోపూజ ,గణపతి, నవగ్రహ, రుద్రహోమములు, భూదాన సంకల్ప పూజ, మహా అన్నదానము నిర్వహించారు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా సమయతి ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షులు నాట్యగురువులు మహేష్ శిష్యులు చేసిన నృత్యము ప్రేక్షకులకు ఆకట్టుకున్నది. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాధశర్మ నాట్య గురువు మహేష్ కు ఉత్తమ సాంస్కృతిక నాట్య సేవా పురస్కారం అందజేశారు. నిజామాబాద్ గౌతమ్ నగర్ ఎన్జీవోఎస్ కాలనీ అధ్యక్షులు పార్శి చక్రపాణి అరుణ దంపతులు, పుష్పలత సంగీత మనస్విని పార్శి సులోచన తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు



# ఆయుర్వేదం, యోగతో ఆరోగ్యకరమైన జీవనం







**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి (సెప్టెంబర్-22):** 11వ ఆయుర్వేద దినోత్సవ వేడుకల్లో భాగంగా వేములవాడలో ఆయుర్వేదం, యోగ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగ శిక్షకులు ఎలిగేటి కృష్ణ పాల్గొని యోగ సాధన ప్రాధాన్యతను వివరించారు.

వేములవాడ డీఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయుర్వేదం, యోగ భారతీయ ప్రాచీన ఆరోగ్య సంప్రదాయాల్లో ముఖ్యమైనవని అన్నారు. నిత్య జీవితంలో యోగ సాధనతో పాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే యోగను అలవర్చుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో ఫార్మసిస్ట్ పుష్పాలత, యోగా టీచర్ రిషిక, ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం రాజారత్నం, యోగ సాధకులు గోసుల రవి, ముమ్మడి శ్రీనివాస్, రఘు, పర్షరామ్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలు ఆయుర్వేదం, యోగను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

# ప్రపంచ వాణిజ్య కేంద్రంగా హైదరాబాద్

## (హెచ్. ప్రతాప్)

ఐటీ, ఔషధ, జీవశాస్త్ర, స్టార్టప్ రంగాల్లో ఇప్పటికే అంతర్జాతీయ గుర్తింపు పొందిన హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి వాణిజ్య, పెట్టుబడి, ఆవిష్కరణ కేంద్రంగా తీర్చిదిద్దాలని తెలంగాణ ప్రభుత్వం విస్తృత లక్ష్యాలతో ముందుకు సాగుతోంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల స్థాయికి, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలన్న తెలంగాణ రైజింగ్--2047 దృష్టిలో హైదరాబాద్ ప్రధాన వృద్ధి ఇంజిన్‌గా నిలవనుంది.

ఈ ప్రణాళికలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది భారత్ ఫ్యూచర్ సిటీ. సుమారు 30 వేల ఎకరాల్లో ఆధునిక, పర్యావరణ అనుకూల గ్రీన్‌ఫీల్డ్ నగరంగా దీనిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కృత్రిమ మేధ, డేటా కేంద్రాలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, ఆరోగ్య సేవలు, విద్య, జీవశాస్త్ర పరిశ్రమలు, ఆధునిక కార్పొరేట్ కార్యాలయాలు, పరిశోధన--ఆవిష్కరణ సంస్థలకు ప్రత్యేక వేదికగా దీనిని తీర్చిదిద్దే ప్రణాళిక ఉంది. దేశీయ, అంతర్జాతీయ కంపెనీలకు అవసరమైన ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు ఒకే ప్రాంతంలో అందుబాటులోకి తేవడం దీని ప్రధాన ఉద్దేశం. వాణిజ్య విస్తరణకు రవాణా అనుసంధానం కీలకమని గుర్తించిన ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రెండో దశను విస్తృతంగా చేపట్టాలని నిర్ణయించింది. కొత్త కారిడార్ల ద్వారా నగర శివారు ప్రాంతాలు, విమానాశ్రయం, ఫ్యూచర్ సిటీని అనుసంధానించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డుకు అవతల ప్రాంతీయ రింగ్ రోడ్డు, దానితో అనుసంధానించే రేడియల్ రోడ్లు నిర్మించడం ద్వారా నగరంపై రవాణా ఒత్తిడిని తగ్గిస్తూ కొత్త వాణిజ్య, పారిశ్రామిక మండలాలకు వేగవంతమైన కనెక్టివిటీ కల్పించాలన్నది లక్ష్యం.

మరోవైపు మూసీ పునరుజ్జీవనం, మురుగునీటి శుద్ధి, కాలుష్య నియంత్రణ, విద్యుత్ వాహనాల ప్రోత్సాహం ద్వారా హైదరాబాద్‌ను మరింత నివాసయోగ్యమైన, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల సేవల రంగం, దాని వెలుపల తయారీ, లాజిస్టిక్స్, పారిశ్రామిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తూ సమతుల్య నగరాభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తోంది.

హైదరాబాద్‌కు ఇప్పటికే ఉన్న నైపుణ్య మానవ వనరులు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ--ఔషధ రంగాల బలం గొప్ప పునాది. దీనికి సమర్థ రవాణా, నిరంతర విద్యుత్, నీటి భద్రత, వేగవంతమైన అనుమతులు, మెరుగైన పట్టణ జీవన ప్రమాణాలు జతకలిస్తే హైదరాబాద్ భవిష్యత్తులో భారతదేశానికే కాకుండా ఆసియాలో ప్రముఖ వాణిజ్య, పెట్టుబడి, సాంకేతిక కేంద్రంగా ఎదిగే సామర్థ్యం కలిగి ఉంది.

# నవీన్ పటేల్‌కు ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు

**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి ( సెప్టెంబర్-22):** వేములవాడ పట్టణానికి చెందిన జర్నలిస్ట్ చేకూర్తి నవీన్ పటేల్‌కు అరుదైన గౌరవం లభించింది. పాత్రికేయ రంగంలో అందిస్తున్న సేవలతో పాటు గత ఐదేళ్లుగా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ఎక్సలెన్స్ అవార్డును అందజేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి మెయిన్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును స్వీకరించారు.

పాత్రికేయ వృత్తిలో భాగంగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, తనకు సాధ్యమైన మేరకు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న నవీన్ పటేల్‌కు ఈ పురస్కారం దక్కడం పట్ల సహచర జర్నలిస్టులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.







# ప్రెస్ క్లబ్ గణేష్ లడ్డు ను వేలంలో 49 వేలకు దక్కించుకున్న జాయింట్ సెక్రెటరీ వర్దేల్లి బాపూరావు



**హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్, సెప్టెంబర్, 22: హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో గణేష్ లడ్డూ వేలం పాటలో 49 వేల రూపాయలకు పాట పాడి దక్కించుకున్న జాయింట్ సెక్రెటరీ వర్దేల్లి బాపూరావు. గతేడది 40,000 కు గణేష్ లడ్డూ వేలంపాటలో లడ్డును కైవసం చేసుకున్నారు ఈ ఏడాది 49 వేలకు గణేష్ లడ్డూను దక్కించుకోవడం విశేషం. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రెటరీ చిలుకూరి హరిప్రసాద్ సహా ప్రెస్ క్లబ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టిసాన్ కుటుంబ సభ్యుల వైద్య చికిత్సకు వెస్కో సాయం



హైద్రాబాద్ సెప్టెంబార్ 22: ఎన్ టి ఆర్ జిల్లా, గంపలగూడెం మండలం గుళ్ళపూడి గ్రామంలో కర్ర పని చేసుకుంటూ నివసిస్తూ, పోలోజు భోగాచారి భార్య

రజనికి మెదడు లో ఇన్ఫెక్షన్ ఏర్పడి శస్త్రచికిత్స చేయించాల్సి రావడంతో సుమారు రెండున్నర లక్షలు ఖర్చయ్యాయి.

ఈ పరిస్థితుల్లో భోగాచారి వెస్కో సహాయం కోరగా

భోగాచారి భార్య, ఇద్దరు పిల్లల తదుపరి హృద్రోగ వైద్య చికిత్స కోసం గౌరవ దాతల సహకారంతో విజయవాడ జింఖానా గ్రౌండ్ వద్ద సంఘం వారు నిర్మిస్తున్న శ్రీ విశ్వనాథ విజ్ఞాన మండపం లో సేవా కార్యక్రమంలో వెస్కో ట్రస్టీలు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులు జవ్వాది కూర్మాచార్యులు చేతుల మీదుగా పోలోజు భోగాచారి కి 80,000 రూపాయల చెక్ అందచేసారు.ఈ సేవా కార్యక్రమం లో స్థానిక నాయకులు పెంట సాయి కిరణ్, వెగ్గళం శంకరాచారి, ఏ. శ్రీనివాసాచారి, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# రాజన్న యూత్ 24 అడుగుల గణనాథుడికి ఘనంగా పూజలు

## వైభవంగా 34వ వార్షికోత్సవ వేడుకలు -- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్22:** వినాయక చవితి సందర్భంగా భక్తిశ్రద్ధలతో గణనాథుడిని పూజించడం ఆనవాయితీగా వస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని శ్రీ బద్ది పోచమ్మ వీధిలో రాజన్న యూత్ (ఆర్ వై సి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 24 అడుగుల భారీ సిద్ధి బుద్ధి వినాయకుడిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రాజన్న యూత్ ఆధ్వర్యంలో 34వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఇంత భారీ గణనాథుడిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. భక్తులందరికీ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు లభించాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

అనంతరం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఈవో శ్రీమతి రమాదేవి గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరీంనగర్ ఏసీపీ శ్రీ వెంకటస్వామి కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారికి పూజలు చేశారు.

పూజా కార్యక్రమాల అనంతరం రాజన్న యూత్ సభ్యులు ప్రముఖులను శాలువాలతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. 24 అడుగుల భారీ గణనాథుడు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుండగా, పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న యూత్ ప్రతినిధులు, సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మర్పల్లి వినాయక లడ్డు ప్రసాదం కైవసం చేసుకున్న నీలి వెంకట్ రామ్, కుటుంబం



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 22 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి వినాయక లడ్డు ప్రసాదంవేలం పాటశ్రీహోరా హోరీగా పోటీ తత్వంతో గణనాధుని హస్తాలు తాగిన పరిమళ ప్రసన్నత లడ్డు పోటాపోటీలో తలపడి అగ్రవర్గాలపై ధీటుగా నీలీ వారి కుటుంబం వేలంపాటలో లడ్డు ప్రసాదం నీలి వెంకట్ రామ్ కుటుంబం23500 కుదక్కించుకుందని తెలిపారు దాదాపు పది సంవత్సరాల నుండి నీలి వారి కుటుంబం పై గణనాధుని ఆశీస్సులతో లడ్డు కైవసం చేసుకుంటున్నారని తెలిపారు

# సహజ వ్యవసాయం నేల ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

### మండల వ్యవసాయ అధికారి సాయి దీక్షిత్

### మల్లవరం గ్రామంలో సహజ వ్యవసాయంపై రైతులకు అవగాహన

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 22:**మధిర మండలం మల్లవరం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ సహజ వ్యవసాయ మిషన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు సహజ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.




ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సాయిదీక్షిత్ మాట్లాడుతూ, సహజ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకునే అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సహజ వ్యవసాయం అనేది కేవలం రసాయనాల వినియోగాన్ని తగ్గించడం మాత్రమే కాకుండా, నేల ఆరోగ్యం, పంట అవశేషాల వినియోగం, నీటి సంరక్షణ, జీవ వైవిధ్యం, జీవ ఆధారిత ఇన్‌పుట్ల వినియోగం వంటి అంశాలను సమగ్రంగా పరిగణించే వ్యవసాయ విధానమని వివరించారు. రైతులు ముందుగా చిన్న విస్తీర్ణంలో సహజ వ్యవసాయ పద్ధతులను ప్రదర్శనా క్షేత్రాలుగా చేపట్టి, సాగు ఖర్చు, దిగుబడి మరియు నికర ఆదాయాన్ని నమోదు చేసుకుని ఫలితాల ఆధారంగా తదుపరి విస్తరించాలని అధికారులు సూచించారు.

రైతులు బీజామృతం, జీవామృతం, ఘనజీవామృతం, మల్చింగ్ చేసుకొని పంట వైవిధ్యం, జీవ ఆధారిత పురుగు నియంత్రణ మరియు సమర్థవంతమైన నీటి నిర్వహణ వంటి పద్ధతులను తమ పంటలకు అనుగుణంగా అవలంబించాలని సూచించారు.

వరి, పత్తి, మిరప మరియు పప్పుధాన్యాలలో పురుగు, తెగుళ్లను ముందుగానే గుర్తించి, అవసరాన్ని బట్టి మాత్రమే నియంత్రణ చర్యలు చేపట్టాలని తెలిపారు. పురుగు కనిపించిన వెంటనే మందులు పిచికారీ చేయకుండా, ముందుగా పురుగును గుర్తించి, దాని ఉధృతిని పరిశీలించి, ఉపయోగకరమైన కీటకాల ఉనికిని గమనించి, అవసరమైనప్పుడు సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలని సూచించారు.

అలాగే పంట అవశేషాలను కాల్చకుండా సరైన విధంగా వినియోగించడం, నేలలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం, భూసార పరీక్షల ఆధారంగా పోషక యాజమాన్యం చేపట్టడం వంటి అంశాలను వివరించారు.

ఈ సందర్భంగా మల్లవరం వ్యవసాయ విస్తరణ అధికారి గోపి రైతులకు పంటల వారీగా సహజ వ్యవసాయ పద్ధతులపై వివరించారు. ఎన్ ఎం ఎన్ ఎఫ్ వాలంటీర్ జస్వంత్ సహజ వ్యవసాయంలో జీవ ఆధారిత ఇన్‌పుట్ల వినియోగం మరియు రైతులకు అందుబాటులో ఉన్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మల్లవరం క్లస్టరకి చెందిన రైతులు పాల్గొన్నారు.

# డీజెఎఫ్ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### అక్టోబర్ 7న సంగారెడ్డిలో 11వ రాష్ట్ర మహాసభలు

### మహాసభలకు హాజరుకావాలని డీజేఎఫ్ నాయకుల ఆహ్వానం

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 22 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :మహాసభలకు హాజరు కావాలని డీజెఎఫ్ నాయకుల ఆహ్వానం



దళిత జర్నలిస్టుల ఫోరం (డీజెఎఫ్) 11వ రాష్ట్ర మహాసభలకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని డీజెఎఫ్ నాయకులు మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. అక్టోబర్ 7న సంగారెడ్డిలో నిర్వహించనున్న మహాసభల పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మహాసభల కరపత్రాన్ని ఆయనకు అందజేశారు.డీజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తలారి యాదగిరి మాట్లాడుతూ,దళిత జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలపై పోరాటానికి డీజెఎఫ్ ముందుంటుందని తెలిపారు. దళిత జర్నలిస్టుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్, ఇళ్ల స్థలాలు, ఆరోగ్య సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య, అర్హులకు ఉచిత బస్, రైలు పాసులు, నిరుద్యోగ భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. దళిత జర్నలిస్టులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించడంతో పాటు, అకాల మరణం చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ.50 లక్షలఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు రాపాక విజయ్ రాజు, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి ముక్కగల్ల యాదన్న, పుల్కల్ మండల డీజెఎఫ్ అధ్యక్షుడు రవికుమార్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డిలో జరిగే రాష్ట్ర మహాసభలనువిజయవంతం,చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీజెఎఫ్ నాయకులు కోరారు......

# ఆగస్టు 13 2026 వరకు కొత్త గా పట్టా పాస్ బుక్ లు వచ్చిన రైతులు

### మీ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి దగ్గర కి వచ్చి ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనగా రైతు గుర్తింపు కార్డు ఆన్లైన్ చేయించు కొగలరు,

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సేప్టంబర్ 22 (ప్రజాబలం )"సంగారెడ్డి జిల్లా** :ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వలన

పంట కి కనీస మద్దతు ధర వచ్చే అవకాశంఉంది,(ఫ ఫ యస్) కొత్తగావచ్చిన ఎరువుల యాప్ ద్వారాఎరువులనుతీసుకోవడానికి వీలుంటుంది,బ్యాంకుల వద్ద పంట రుణాలు తీసుకోవడానికి అర్హత ఉంటుంది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీలు రాయితీలు వర్తించే అవకాశం ఉంటుంది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు అర్హులుగా ఉంటారు గమనిక: ప్రజలకి ఆధార్ కార్డు ఏ విధంగా పనిచేస్తుందో ప్రతి రైతుకు కూడా ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్డు అలాంటిది కాబట్టి ఆగస్టు 13 2026 వరకు కొత్త గా పట్టా పాస్బుక్ వచ్చిన ప్రతి ఒక్క రైతు కూడా ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్డు చేయించుకోవలెను




# ఎస్.టి.యు 80వ వసంతోత్సవాలను జయప్రదం చేయాలి...

### రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.రమేష్




ఈనెల 27న హైదరాబాద్‌లోని నాగోల్ శుభం కన్వెన్షన్ హాల్లో నిర్వహించనున్న రాష్ట్రోపాధ్యాయ సంఘం 80వ వసంతోత్సవాలకు ముఖ్య అతిధులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మరియు మంత్రులు విచేయుచున్నారని, జిల్లా లోని ఉపాధ్యాయులందరు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.రమేష్ పిలుపునిచ్చారు.

మంగళవారం గుడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘం నాయకులతో,పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి వారు పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కే.రమేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం 1947 జూన్ 9న ఆవిర్భవించిన మొట్టమొదటి ఉపాధ్యాయ సంఘం నాటి నుంచి నేటి వరకు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతోందన్నారు.

ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమంతో పాటు బడుగు బలహీన వర్గాల విద్యార్థుల అభ్యున్నతికి కూడా ముందుండి, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు, విద్యా ప్రమాణాల పెంపునకు చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం పెండింగ్లో ఉన్న డి ఏ లన్నీ విడుదల చేసి 51% ఫిట్మెంట్తో పిఆర్సి ప్రకటించాలని సిపిఎస్ నురద్దు చేసి ఓపిఎస్ అమలుపరచాలని కోరారు.

ఈనెల 27న జరిగే రాష్ట్రస్థాయి వసంతోత్సవాలకు ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సాయిబాబు,పాఠశాల ఉపాధ్యాయులు సురేందర్,భాస్కర్, అజీమ్,రఘునందన్ గౌడ్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

# భవాని నగర్‌లో 9వ మాస పోషణ కార్యక్రమం




**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి (సెప్టెంబర్–22):** చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని 11వ వార్డు కౌన్సిలర్ వెంగళ అనిత – శ్రీకాంత్ గౌడ్ అన్నారు. భవాని నగర్ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన 9వ మాస పోషణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో అందుతున్న పౌష్టికాహారం, చిన్నారుల ఆరోగ్య పరిస్థితులపై కౌన్సిలర్ అనిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులతో మాట్లాడి వారి ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని, గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం అర్హులకు సక్రమంగా చేరేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. వార్డులోని చిన్నారులు, మహిళల సంక్షేమానికి సంబంధించి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మీనాక్షి, ఆశా వర్కర్ ఉమ, వార్డు ఆఫీసర్ చక్రధర్, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రత

## 200 మంది పోలీసులతో బందోబస్తు.. డీజేలకు అనుమతి లేదు



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి (సెప్టెంబర్ 22)**వేములవాడ పట్టణంలో బుధవారం నిర్వహించనున్న గణేష్ నిమజ్జనం, శోభాయాత్రను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. పట్టణంలోని సుమారు 320 గణేష్ మండపాల్లో కొలువుదీరిన గణనాథుల నిమజ్జనం సందర్భంగా 'జీరో యాక్సిడెంట్ -- జీరో ఇన్సిడెంట్' లక్ష్యంతో చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.



మంగళవారం ఆలయ గుడి చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జనం, శోభాయాత్ర సందర్భంగా సుమారు 200 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పికెట్లు, పుషింగ్ పార్టీలను ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలను పాటిస్తూ నిర్ణీత సమయంలో నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఎస్పీ సూచించారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

డీజేలకు అనుమతి లేదు:

నిమజ్జనం, శోభాయాత్రలో ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసే పాటలు వినిపించడం, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా బాణాసంచా కాల్చడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు.

శోభాయాత్రలో క్రమపద్ధతిలో క్యూ పాటించాలని, వాహనాల పరిస్థితిని ముందుగానే పరిశీలించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొని ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. మహిళలు, చిన్నారులు సహా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.శోభాయాత్ర సందర్భంగా ఏవైనా సమస్యలు, అవాంఛనీయ పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పాలమూరు శ్రీనివాస్ రెడ్డి ద్వారా అన్న ప్రసాద వితరణ







గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 22 సెప్టెంబర్ 2026మణికొండ సెక్రటేరియట్ కాలనీలో పేరు ప్రఖ్యాతలు గాంచిన గోల్డెన్ టెంపుల్ సమీపంలోని శ్రీ రామ్ నగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం రోజున పాలమూరు శ్రీనివాస్ రెడ్డి ఏకమొత్తం ఆర్థిక సహకారంతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగిందని, అందుకు స్థానిక భక్తులు అశేష సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం గైకొన్నారని శ్రీరామ్ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు చంద్రకాంత్ గౌడ్, బబ్లు, శ్రీనివాస్ చారి, ఆదిత్య, పుప్పాల శ్రీనివాస్ రావు, కిరణ్ కుమార్, గోవింద్, వల్లభనేని శ్రీనివాసరావు, అందె లక్ష్మణ్ రావు, రమేష్, మన్మధ తదితరులు తెలిపారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి రూ.2 లక్షల ఎల్ఓసీ




జహీరాబాద్, సెప్టెంబరు 22 ప్రజా బలం ప్రతినిధి: అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జహీరాబాద్ మండలం మధురై తండాకు చెందిన పవార్ తుకారాంకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2 లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరైంది. ఈ మేరకు మంజూరైన ఎల్ఓసీని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మంగళవారం లబ్దిదారుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అత్యవసర వైద్య చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి సీఎం సహాయనిధి ద్వారా సాయం అందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లబ్దిదారుడి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే మాణిక్‌రావుతో పాటు జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బొగ్గల సంగమేశ్వర్, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జున స్వామి పల్లకి సేవలో ఎమ్మెల్యే మాణిక్‌రావు



జహీరాబాద్ , సెప్టెంబర్ 22 ప్రజాబలం ప్రతినిధి: మొగుడంపల్లి మండలంలోని ధనసిరి గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి పల్లకి సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ మల్లికార్జున స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. భక్తి, ఆధ్యాత్మికతతో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. స్వామివారి కృపతో ప్రజలందరికీ శాంతి, సంతోషం కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాణిక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఓంకార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజు హబ్బీ, సీనియర్ నాయకులు ప్రతాప్ కులకర్ణి, ఈశ్వర్‌రెడ్డి, షకీల్, గోపాల్, సంజు, రాథోడ్ భీమ్‌రావు నాయక్, నయీం ఉద్దీన్, చిన్నరెడ్డి, బి.రాజు, గాలెప్ప, యశ్వంత్‌రెడ్డి, బక్కన్నతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సత్తుపల్లిలో భక్తి సందడి.. గణనాథుడికి ఘనంగా పూజలు

### పలు మండపాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి, డాక్టర్ మట్టా దయానంద్



సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 22:సత్తుపల్లి నియోజకవర్గం గణేశ్ నవరాత్రి ఉత్సవాలతో భక్తిభావంతో మార్మోగింది. నియోజకవర్గంలోని పలు మండపాల్లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో గణేష్ నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను ఈ సందర్భంగా నాయకులు అభినందించారు. ఉత్సవాలు ప్రశాంతంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమాల్లో సత్తుపల్లి, కల్లూరు మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఏఎంసీ చైర్మన్లు, డైరెక్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఐదు మండలాల కాంగ్రెస్ నాయకులు, సత్తుపల్లి, కల్లూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు,





ఆయా ప్రాంతాల్లో భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికారు.

తల్లాడ నుంచి ప్రారంభమైన పూజలు..

తల్లాడ మేజర్ పంచాయతీ గ్రామంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని మంత్రి పొంగులేటి, డాక్టర్ మట్టా దయానంద్ సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు.

కల్లూరు, పెనుబల్లిలోనూ..

కల్లూరు మండలం ఖాన్‌ఖాన్‌పేటలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెనుబల్లి మండలంలోని పలు గణేష్ మండపాలను సందర్శించి వినాయకుడికి పూజలు చేశారు.

సత్తుపల్లిలో మండపాల సందర్శన

సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జవహర్‌నగర్ కృష్ణుడి గుడి వద్ద, జూపల్లి కంటి ఆసుపత్రి రోడ్డు, శ్రీ కోదండ రామాలయం, జేవీఆర్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన శ్రీ ప్రసన్న గణపతి ఉత్సవాల్లో వారు పాల్గొన్నారు. జేవీఆర్ పార్క్ ఎదురుగా ఉన్న శ్రీ గణేష్ గుడి వద్ద నిర్వహించిన నవరాత్రి పూజల్లోనూ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులతో కలిసి అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు.

కలిసికట్టుగా ఉత్సవాలు..

సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, వివిధ కమిటీల ప్రతినిధులు, పార్టీ జిల్లా, నియోజకవర్గ నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు, ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమ్మ పేరిట మొక్క.. భావితరాలకు పచ్చని బహుమతి



జహీరాబాద్, సెప్టెంబరు 22 ప్రజా బలం ప్రతినిధి: అమ్మపై ప్రేమను చాటడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే సందేశంతో హుగ్గెల్లి ప్రభుత్వ పాఠశాలలో 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి జ్ఞాపకార్థం ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి, దానిని బిడ్డలా సంరక్షించాలని పిలుపునిచ్చారు. నేడు నాటే మొక్కలు భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పాఠశాలలో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను ఉపాధ్యాయులు, విద్యార్థులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## గణపురం గ్రామంలో శివాజీ యూత్ గణేష్ పూజాలో పాలు గోన మాజీ ఎంపిటిసిఉలిగడ్లబి చ్చన్న



వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 22(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం ఘనపూర్ గ్రామంలో వినాయక పూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపిటిసి ఉల్లిగడ్డ బిచ్చన్న,మరియు వారి కుటుంబ సభ్యులు నాగయ్య స్వామి ,రాయిపల్లి నాగన్న ,శివాజీ యూత్ ప్రెసిడెంట్ సుధాకర్, గణనధుని పూజా కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించి గ్రామాన్ని గ్రామ ప్రజల్ని ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో గ్రామ ప్రజలను దీవించాలని మాజీ ఎంపీటీసీ బి చ్చన్న గణనాథునికి మా విన్నపము సమర్పించినామని తెలిపారు

## పంచలింగాల్ గణేష్ పూజా కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



వికారాబాద్ నియోజకవర్గం సెప్టెంబర్ 22 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం పంచ లింగాల్ గ్రామంలో వినాయక పూజ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు గ్రామ ప్రజలు అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొని జిల్లా నాయకులు గ్రామ ప్రజలు గణనాథుని ఆశీస్సులతో విందు కార్యక్రమంలో మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్, జిల్లా నాయకులురవీందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ యాదవ్, మాజీ ఎంపిటిసి సురేష్, ఉప సర్పంచ్ ముత్యాల ఆంజనేయులు గౌడ్, సామే ల్, సురేష్, మణికం చారి,కృష్ణ, సంజీవ్, అశోక్, హైమద్, గౌరయ్య,భాస్కర్, అనంతయ్య, యువకులు ప్రజలు అన్న ప్రసన్న కార్యక్రమంలో పాల్గొన్నారు

# ఆయుర్వేదంతో ఆరోగ్యం.. యోగాతో ఉల్లాసం

### 11వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా సత్తుపల్లిలో అవగాహన కార్యక్రమాలు

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 22:** సంప్రదాయ వైద్య విధానాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించేందుకు 11వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్తుపల్లిలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ యునాని వైద్యశాల, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సంయుక్తంగా ఈ కార్యక్రమాలను చేపట్టాయి.






సెప్టెంబర్ 21న మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారం, సమతుల్య ఆహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. చిన్న వయసు నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరుచుకోవాలని సూచించారు.

సెప్టెంబర్ 22న ఆరోగ్య పరిరక్షణలో యోగా ప్రాధాన్యతను వివరిస్తూ యోగా వాక్ నిర్వహించారు. రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు వివరించారు.

ఈ సందర్భంగా యునాని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేందర్, ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షీలా స్రవంతి మాట్లాడుతూ.. సంప్రదాయ వైద్య విధానాలపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. యోగా, పరిశుభ్రత, సమతుల్య ఆహారం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను జీవనశైలిలో భాగం చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమాల్లో ఫార్మసిస్టులు సంతోష్‌కుమార్, కె. శ్రీనివాసరావు, యోగా ఇన్‌స్ట్రక్టర్ శాంతి, ఎస్ఎన్ఓ ప్రవీణ్‌కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ గణనాధుని చెంతన అన్నదానం హాజరైన ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు



**హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో కొలువుదీరిన ఏకదంతుని చెంతన అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పర్యావరణహితంగా ఏర్పాటు చేసిన గణనాధుని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, మాజీ మంత్రి దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఆర్టిఏ జాయింట్ కమిషనర్ వెంకటరమణ, ఆర్టిఓ కృష్ణయ్య, ఖైరతాబాద్ సీఐ వెంకటరెడ్డిలు దర్శించుకుని గౌరీ తనయునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రెస్ క్లబ్ అధ్యక్ష ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, రాజేష్, ట్రెజరర్ రమేష్ వైట్ల, జాయింట్ సెక్రటరీలు హరి ప్రసాద్, బాబురావు లు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాలకమండలి మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ లో ప్రతి ఏడాది గణేష్ ఉత్సవాలతో పాటు అన్ని రకాల వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ వస్తున్నామని అన్నారు. సుమారు 600 మంది కి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఈసీ సభ్యులు అమిత్ బట్, శ్రీనివాస్ రెడ్డి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



# మియాపూర్ వద్ద ఏర్పాటు చేసిన గణేషుడి వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు – సంగీత



**మియాపూర్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్) సెప్టెంబర్ 22 మియాపూర్ –** బస్సు బాడీ యూనిట్ వద్ద వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా కొనసాగుతున్నాయి.

ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, శాంతి, ఐశ్వర్యం, సర్వతోముఖ శ్రేయస్సు కలగాలని వినాయకుడిని ప్రార్థించానని నిర్వాహకురాలు సంగీత తెలియజేశారు.

"మానవ సేవే మాధవ సేవ" అనే సేవా భావనతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు, స్థానిక నివాసితులు, ఆటో యూనియన్ సభ్యులు, డ్రైవర్లు, నిరుపేద ప్రజలకు తన వంతుగా భగవంతుని పేరిట అన్నదాన రూపేణా ఆహారాన్ని అందించినట్లు సంగీత మీడియాతో వివరించారు. మియాపూర్ బస్ బాడీ యూనిట్ ఎదురుగా ఏర్పాటు చేసిన గణేశుని వద్ద నిర్వాహకురాలు సంగీత పలువురిని ఆహ్వానించి శాలువాతో ఘనంగా సత్కరించారు. శేరిలింగంపల్లి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఇన్చార్జి ఆధ్వర్యంలో జరిగిన అన్న సంతర్పణ కార్యక్రమంలో నిర్మలమ్మ, శోభ, సంగీత, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా జేఏసీ అధ్యక్షుడిగా శ్రీనివాస్


తెలంగాణ జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ
TELANGANA JOURNALIST JOINT ACTION COMMITTEE
TJJAC
★ PRESS | MEDIA | SOCIETY | SERVICE ★
జర్నలిస్టుల ఐక్యత.. సమాజ సేవలో..
తొగరి కరుణాకర్ రాష్ట్ర అధ్యక్షులు సెల్: 7842288849
బత్తుల గణేష్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సెల్: 9177108128

నియామక పత్రం

తెలంగాణ జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)నందు వీరిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయనైనది. జేఏసి నియమనిబంధనలు ఉల్లంఘించిన వారిని పదవి నుండి తొలగించబడును.

1).చీరాల రవీందర్- జిల్లా అధ్యక్షులు- పెద్దపల్లి
2).మందుల బాలకృష్ణ- జిల్లా అధ్యక్షులు- సంగారెడ్డి
3).తక్కళ్లపల్లి శ్రీనివాస్- జిల్లా అధ్యక్షులు- మహబూబాబాద్

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి | తేదీ: [illegible] | రాష్ట్ర అధ్యక్షులు



**మహబూబాబాద్, సెప్టెంబర్ 22:** తెలంగాణ జర్నలిస్టుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా తక్కలపల్లి శ్రీనివాస్ నియమించినట్లు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తొగరి కరుణాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల గణేష్ లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన సంక్షేమం కోసం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలను జిల్లా స్థాయిలో సమన్వయం చేయాల్సిన బాధ్యతను శ్రీనివాస్‌కు అప్పగించారు. నియామక ఉత్తర్వుల ప్రకారం తక్కళ్లపల్లి. శ్రీనివాస్ మంగళవారం నుంచి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా అధికారిక బాధ్యతలు స్వీకరించనున్నారని, జేఏసీ నియమ నిబంధనలను పాటిస్తూ, సంస్థ క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర నాయకత్వం సూచించింది. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు భవిష్యత్‌లో నిర్వహించాల్సిన కార్యక్రమాలను జిల్లా స్థాయిలో సమన్వయం చేసి విజయవంతం చేయాలని కోరింది. అనంతరం తక్కలపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు తొగరి కరుణాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల గణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర వినాయక ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో మహా అన్నదానం..

### ప్రారంభించిన డిసిసి డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షులు కాపా మురళీకృష్ణ 20 వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 22:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డ్ శాంతినగర్ ఎస్టి కాలనీ నందు వెంకటేశ్వర వినాయక ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో మహా అన్నసంతర్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కాంగ్రెస్ పార్టీ డిసిసి హెల్త్ సెల్ చైర్మెన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, 20 వ వార్డ్ కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు

హాజరై మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నం బ్రహ్మ స్వరూపం" అని , ఆకలితో ఉన్న ఒక వ్యక్తికి భోజనం పెడితే, అతడు పొందే తృప్తి అంతాఇంతా కాదు. భూదానం, గోదానం, ఇలా ఎన్నో దానాలు ఉన్నప్పటికీ, వాటన్నింటికంటే మించినది అన్నదానం అందుకే పెద్దలు దీనిని "మహాదానం" అన్నారు అని , భగవంతుడు మనకు ఇచ్చిన సంపదలో కొంత భాగం తోటివారితో పంచుకోవడం నిజమైన మానవత్వం. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని జరగాలని, అందరి ఆకలి తీరేలా దేవుడు మనందరికీ శక్తినివ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కాంగ్రెస్ నాయకులు తేజావత్ నాగేశ్వరరావు, బాలమ్మ, రాజా ,తిరుపతమ్మ,కృష్ణబాబు కుసుమ, జాలా మహాలక్ష్మి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ చొరవతో ఆందోల్‌కు మరో భారీ అభివృద్ధి కానుక



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 22 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** ఆందోల్-- జోగిపేటలో ఎన్టీఆర్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, అభివృద్ధికి ? 10 కోట్లుమంజూరు.(జి ఓ .ర్ టి .) నం, .282, తేదీ 21-09-2026 ద్వారా పరిపాలనా అనుమతి జారీ,క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిధులువినియోగించనున్నారూ,ఆందోల్ నియోజకవర్గ యువతకు మెరుగైన క్రీడా అవకాశాలు, సౌకర్యాల కల్పనకు మరో ముందడుగు మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ, చొరవతో ఆందోల్ అభివృద్ధిలో మరో కీలక మైలురాయి.....

# ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్ మూసివేత

దసరా ఉత్సవాల నిమిత్తం భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించేందుకు ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్ మరామత్తు పనులు చేపట్టే క్రమంలో సెప్టెంబర్ 22 ఉదయం నుండి వారం రోజుల పాటు ఘాట్ రోడ్ పూర్తిగా మూసివేయుటకు నిర్ణయించడమైనది. ఈ వారం రోజులు శ్రీ కనకదుర్గానగర్ మార్గం నుండి భక్తులు దేవస్థానం నకు చేరుకోవలసియున్నది. హైదరాబాద్ నుండి వచ్చే భక్తులు పున్నమి ఘాట్లో తమ వాహనాలు పార్క్ చేసుకొని, అక్కడ నుండి దేవస్థానం ఏర్పాటు చేస్తున్న ఉచిత బస్ ద్వారా దేవస్థానమునకు చేరుకోవచ్చని, విశాఖపట్నం, చెన్నయ్ తదితర ప్రాంతాల నుండి వన్ టౌన్ వైపు వచ్చే భక్తులు సీతమ్మ వారి పాదాలు వద్ద ఉన్న హోల్డింగ్ ఏరియాలో తమ వాహనాలు పార్క్ చేసుకొని దేవస్థానం ఏర్పాటు చేసే ఉచిత బస్ ద్వారా దేవస్థానమునకు చేరుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి వికె శీనానాయక్ తెలిపారు.

# పచ్చని ప్రాంగణమే ప్రగతికి ప్రతీక పాఠశాలలో మొక్కలు నాటిన తహసీల్దార్,



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 22:** ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూలపోచారం పాఠశాల ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణ,పచ్చదనం పెంపొందించాలనే ఉద్దేశంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల తహసీల్దార్ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ సిహెచ్. శేషగిరిరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థి దశ నుంచే మొక్కల సంరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని క్రమం తప్పకుండా సంరక్షించినప్పుడే కార్యక్రమానికి సార్థకత చేకూరుతుందని అన్నారు.పచ్చని చెట్లు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించేందుకు పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.నాటిన ప్రతి మొక్కను విద్యార్థులు దత్తత తీసుకుని సంరక్షించేలా చర్యలు చేపట్టాలన్నారు. డిప్యూటీ వార్డెన్ డిఎస్. నాగేశ్వరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సొంత మొక్కగా భావించి సంరక్షించాలని సూచించారు. నేడు నాటే ప్రతి మొక్క భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన సంపదగా మారుతుందని తెలిపారు.పాఠశాల ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు మొక్కలను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఒక్క మొక్క నాటడం కాదు ఒక తరానికి ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడం మా కర్తవ్యం అని ప్రతిన పూనారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం. చంద్రరావు,బి.రవి,బి. సింగ్య, బి.శోభన్ నాయక్,పాయం శ్రీనివాస్, వి.రమేష్,డి. వెంకటరమణ, బి.శారదాబాయి, డి.ఉష్రశ్రీ, బి.కపూర్య, కళ్యాణి,పద్మ,పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన బానోత్ సుందర్లాల్.

**యువత ఉత్సవాలకే పరిమితం కాకుండా సామాజిక సేవారంగంలో ముందుండాలి..**

**వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు బానోతు సుందర్లాల్**

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 22**యువత ఉత్సవాలకే పరిమితం కాకుండా సామాజిక సేవా రంగంలో ముందుకు రావాలని వైరా నియోజకవర్గ నాయకులు బానోతు సుందర్లాల్ అన్నారు.



ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని ఈర్లపూడి గ్రామంలో మాలోతు బాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని గణేష్ మండపం వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమంలో వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు బానోతు సుందర్లాల్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా సుందర్లాల్ మాట్లాడుతూ అన్ని దానాల కంటే అన్నదానం మహా గొప్పదని వినాయక నవరాత్రుల ఉత్సవాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించి వారి కోరిన కోరికలు నెరవేరాలని ఆకాంక్షించారు ఆ ఏకదంతుని వినాయకుని ఆశీస్సులు అందరికీ కలగాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాదావత్ సైదులు నాయక్, పంగిడి మాజీ సర్పంచ్ బానోతు మంగీలాల్, వెంకటేశ్వర్లు, ధారావత్ మదన్, బానోత్ శంకర్,ఉత్సవ కమిటీ సభ్యులు, యువత, భక్తులు పాల్గొన్నారు.

# గిరిజన ఏజెన్సీ యువతకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలి

**సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, గిరిజన ప్రజాప్రతినిధులు, మంత్రులు**

**ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక కోటా అమలు చేయాలని వినతి**

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 22:**గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లోని యువతకు ఉద్యోగ నియామకాల్లో 75 శాతం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆధ్వర్యంలో పలువురు గిరిజన ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కలిశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్తో కలిసి ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎమ్మెల్యే కొమరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఇతర గిరిజన ప్రజాప్రతినిధులు ఏజెన్సీ ప్రాంతాల యువతకు ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేయాల్సిన అవసరాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

ఏజెన్సీ యువతకు ఉద్యోగాల్లో ప్రత్యేక ప్రాధాన్యత

ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా 2026 పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో ఏజెన్సీ ప్రాంతాలకు సంబంధించిన పోస్టుల్లో 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. మారుమూల గిరిజన గ్రామాల్లోని యువతకు విద్య, శిక్షణ, రవాణా తదితర సదుపాయాలు పరిమితంగా ఉండటంతో సాధారణ పోటీ ప్రక్రియలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజాప్రతినిధులు వివరించారు. ఏజెన్సీ ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని స్థానిక యువతకు ప్రత్యేక అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

అశ్వారావుపేట నియోజకవర్గ యువత తరఫున ఎమ్మెల్యే విజ్ఞప్తి

అశ్వారావుపేట నియోజకవర్గంలో గిరిజన ఏజెన్సీ ప్రాంతాలు విస్తారంగా ఉన్నాయని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లోని అనేక గ్రామాలకు చెందిన గిరిజన యువత ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్నారని వివరించారు.

ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి సిద్ధమవుతున్న యువతకు 75 శాతం ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు లభిస్తాయని, తద్వారా గిరిజన కుటుంబాల ఆర్థిక పరిస్థితుల్లో కూడా మార్పు వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

గత ప్రత్యేక నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలి

ఏజెన్సీ ప్రాంతాలకు గతంలో అమలైన ప్రత్యేక రిజర్వేషన్ నిబంధనలు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, గెజిట్ నోటిఫికేషన్లను పరిశీలించి ప్రస్తుత పోలీస్ నియామక ప్రక్రియలో కూడా 75 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని గిరిజన ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరారు.

చట్టపరమైన, పరిపాలనా అంశాలను పరిశీలించి ఏజెన్సీ ప్రాంతాల స్థానిక గిరిజన యువతకు ప్రయోజనం కలిగే విధంగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రులు, గిరిజన ప్రజాప్రతినిధుల దృష్టి

ఈ అంశాన్ని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గిరిజన యువతకు ఉద్యోగాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రి దనసరి అనసూయ సీతక్క, మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ తదితరులు ఉన్నారు.

అయితే వీరందరూ ఈ ప్రత్యేక భేటీలో పాల్గొన్నారని కాకుండా, రాష్ట్ర మంత్రివర్గ సభ్యులుగా మాత్రమే ఈ సందర్భంలో ప్రస్తావించబడుతున్నారు.

పోలీస్ ఉద్యోగాల భర్తీ నేపథ్యంలో కీలక డిమాండ్

రాష్ట్రంలో పోలీస్ శాఖలో ఖాళీల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఏజెన్సీ యువతకు 75 శాతం రిజర్వేషన్ డిమాండ్ ప్రాధాన్యత సంతరించుకుంది. పోలీస్ ఉద్యోగాల కోసం గిరిజన ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువత సిద్ధమవుతున్న నేపథ్యంలో, నియామకాల్లో తమకు ప్రత్యేక కోటా కల్పించాలని వారు కోరుతున్నారు.



స్థానిక గిరిజన యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోరారు. పోలీస్ శాఖలో స్థానిక యువతకు అవకాశాలు లభిస్తే గిరిజన ప్రాంతాల్లోనే ఉద్యోగ అవకాశాలు పెరగడంతో పాటు యువతలో ప్రభుత్వ ఉద్యోగాలపై మరింత ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు.

యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలి

ఏజెన్సీ ప్రాంతాల్లోని యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కోరారు. ఉద్యోగ అవకాశాల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గించి, స్థానికంగానే ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక విధానాలు అవసరమని తెలిపారు.

ప్రస్తుత పోలీస్ నియామక ప్రక్రియలోనే ఏజెన్సీ ప్రాంతాల యువతకు 75 శాతం రిజర్వేషన్ అమలు చేసే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రిని కోరారు.

సీఎం నిర్ణయంపై గిరిజన యువతలో ఆసక్తి

75 శాతం రిజర్వేషన్ డిమాండ్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఏజెన్సీ ప్రాంతాల గిరిజన యువతలో ఆసక్తి నెలకొంది. ప్రభుత్వం సంబంధిత నిబంధనలు, చట్టపరమైన అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని యువత కోరుతోంది.

పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో 75 శాతం ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేయాలన్న డిమాండ్‌పై ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం ఏజెన్సీ ప్రాంతాల నిరుద్యోగ యువత ఎదురుచూస్తోంది.గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశామని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు.

# పట్లూర్ గ్రామ సర్పంచ్ పరశురాం, ఆధ్వర్యంలో స్మార్ట్ కార్డు పంపిణీ



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 22 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ సివిల్ సప్లై స్మార్ట్ కార్డ్స్ పట్లూరు గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ పరుశురాం ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ పరుశురాం తెలిపారు స్మార్ట్ కార్డు పంపిణీ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ పరుశురాం, మాజీ ఎంపీటీసీ సురేష్, మహేష్, ఉప సర్పంచ్ అఖిల్ గ్రామ పెద్దలు లబ్ధిదారులు కార్యక్రమంలో పాల్గొన్నారు కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒక్కొక్కటిగా అన్ని కార్యక్రమాలు సజావుగా ప్రజలకు అందేలా కృషి చేస్తుందని ఇంకా మిగిలిన అన్ని సంక్షేమ పథకాలు కూడా వెనువెంటనే ఒక్కొక్కటి ప్రారంభించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం అని గ్రామ సర్పంచ్ పరుశురాం, మాజీ ఎంపిటిసి సురేష్, మహేష్, డీలర్ మోహన్ లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు

# మర్పల్లి లో వినాయక పూజా, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ శాసనసభాపతిస్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 22 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి టౌన్ వినాయక పూజ కార్యక్రమంలో తెలంగాణ శాసనసభాపతి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గణనాథుడి ఆశీస్సులతో వేలాది ప్రజలకు అన్నప్రసాదం కార్యక్రమంలో పాల్గొని అందరితో కలిసి అన్న ప్రసన్న భోజనాలు స్వీకరించినట్లు తెలిపారు టౌన్ వినాయక పూజ కార్యక్రమంలో అన్ని వర్గాల వారు ప్రేమ అనురాగాలతో భక్తిశ్రద్ధలతో వినాయక పూజ కార్యక్రమంలో పాల్గొని గణనాధుని ఆశీస్సులు భక్తకోటి జనానికి ఆయురారోగ్యాలతోసుఖ సంతోషాలతో ఆశీర్వదించాలని కోరినట్లు తెలిపారు ముఖ్యంగా మా వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కి భగవంతుడు మంచి ఆరోగ్యం ఇచ్చి ప్రజలకు సేవ చేసే భాగ్యం ఇచ్చి ఇంకా ఉన్నతమైన పదవులు వారు స్వీకరించాలని మా మైనారిటీ కమిటీ తరపున మనస్ఫూర్తిగా తెలియ పరుస్తూ నాను అని రాయల్ ఎలక్ట్రానిక్ హార్డ్వేర్ ప్రోపరేటర్ మహమ్మద్ గౌస్, మాజీ సర్పంచ్ జాఫర్, డాక్టర్ జబ్బర్, మధుసూదన్ రెడ్డి, ఉప్పర్ నాగేష్, కాంగ్రెస్ పార్టీ పెద్దలు పాల్గొన్నట్టు తెలిపారు, కార్యక్రమంలో పెద్దలు సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు ప్రజలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని గణపయ్య ఆశీస్సులతో అన్ని కార్యక్రమలు శుభప్రదంగా నిర్వహించినట్టు తెలిపారు అన్నప్రసన్న కార్యక్రమంలో వేలాదిప్రజలందరూ పాల్గొన్నట్టు తెలిపారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com